

ఆరు జిల్లాల్లో ఎన్నికల కోడ్

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం ఎన్నికలకు వచ్చే నెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ
- 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు
- ఎన్నికల అధికారి, విశాఖపట్నం కలెక్టర్ హరేంధిరప్రసాద్

• 8లో

మరో రెండు నగర వనాలు

కొత్తగా గొలుగొండ, ఎలమంచిలి మండలాల్లో ఏర్పాటు

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అటవీ శాఖ అధికారులు
- ఇప్పటికే కశింకోట మండలం బయ్యవరంలో నగర వనం ఏర్పాటు
- రూ.2 కోట్లతో 50 హెక్టార్లలో అభివృద్ధి పనులు



నగర వనంగా అభివృద్ధి చేయనున్న గొలుగొండ మండలంలోని ఆయుర్వేద ఔషధ మొక్కల క్షేత్రం

నర్సీపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కొత్తగా రెండుచోట్ల నగర వనాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే కశింకోట మండలం బయ్యవరం వద్ద 50 హెక్టార్లలో నగర వనం ఏర్పాటు చేశారు. రూ.2 కోట్లతో చేపట్టిన పలు రకాల అభివృద్ధి పనులు చివరి దశకు వచ్చాయి. మరోవైపు గొలుగొండ, ఎలమంచిలి మండలాల్లో కొత్తగా నగర వనాలను అభివృద్ధి చేయాలని అటవీ శాఖ అధికారులు భావించారు. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు.



సందర్శకులు సేదతీరడానికి నిర్మించిన పగోడా

రాష్ట్రంలోని పచ్చదనం, అడవులను పెంచేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులు పలు రకాల ప్రాజెక్టులను ప్రతిపాదించారు. ఇందులో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో నగర వనాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. వీటిల్లో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరేందుకు పలు రకాల ఏర్పాట్లు చేయాలని ప్రణాళికను రూపొందించారు. జిల్లాలో మొట్టమొదటి నగర వనాన్ని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కశింకోట మండలం బయ్యవరంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ 50 హెక్టార్లలో రూ.2 కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. పచ్చటి వాతావరణం ఉండేలా వివిధ రకాల పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు నాటారు. పగోడాలు, హట్స్, పార్కు, పిల్లలు ఆడుకోవడానికి మైదానం, యోగా మందిరం, వాకింగ్ ట్రాక్, జిమ్, సందర్శకులు కూర్చోడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో మరో రెండు నగర వనాలను ఏర్పాటు చేయడానికి అటవీ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎలమంచిలి సమీపంలోని ఎర్రవరం వద్ద (వేమగిరి రిజర్వ్ ఫారెస్టు ప్రాంతం), నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలంలోని ఆరిలోవ అటవీ ... మిగతా 8వ పేజీలో

పరవాడ ఎంపీడీవోపై వేటు

శ్యామ్‌సుందర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో దురుసు ప్రవర్తన, పొంతనలేని సమాధానాలు ఇచ్చారని అభియోగం



ఎంపీడీవో శ్యామ్‌సుందర్ (ఫైల్ ఫొటో)


పరవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీ డీవో) ఎస్‌డీ శ్యామ్‌సుందర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంక్షేమ పెన్షన్ల పంపిణీకి సంబంధించి కలెక్టర్ బుధవారం ఎంపీ డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ దురుసుగా ప్రవర్తించి, సంబంధం లేని సమాధానాలు చెప్పడాన్ని కలెక్టర్ గుర్తించారు. ఇతని వ్యవహారశైలిపై అనుమానం వచ్చి.. విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పరవాడ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి సిబ్బందిని విచారించారు. డీఎంహెచ్‌వో సమక్షంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్ నుంచి రక్త నమూనాలను సేకరించారు. దీనిపై ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీని ఆధారంగా ఎంపీడీవోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో నుంచి సేకరించిన రక్త నమూనాల నుంచి మద్యం వాసన వస్తున్నట్టు గుర్తించి, విశాఖపట్నంలోని ఆర్‌ఎఫ్‌ఎస్ ల్యాబ్‌కు పంపారు.

సిబ్బందిపై వేధింపులు

సస్పెన్షకు గురైన పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్, మద్యం సేవించి విధులకు ... మిగతా 8వ పేజీలో

అభివృద్ధికి నోచుకోని బొజ్జన్నకొండ



మూడేళ్ల క్రితం రూ.7.5 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం

- పర్యాటకంగా, అధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని నిర్ణయం
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాటి వైసీపీ పాలకులు
- ఎమినిటీ సెంటర్ భవనం మాత్రమే నిర్మాణం
- ఇంతవరకు పర్యాటకులకు అందుబాటులోని రాని దుస్థితి
- బొజ్జన్నకొండను అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం
- కొత్తగా డీపీఆర్ తయారు చేయాలని ఆదేశాలు



వినియోగంలోకి రాని ఎమినిటీ సెంటర్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా వుంది ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్న కొండ అభివృద్ధి పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం బొజ్జన్న కొండను పర్యాటక, ఆధ్మాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఏడు కోట్ల రూపాయలు మంజూరు చేసింది. కానీ ఈ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో నాటి వైసీపీ పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. కోటి రూపాయాల పైచిలుకు పెచ్చించి నిర్మించిన ఎమినిటీ సెంటర్ భవనాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురాకుండా నిరుపయోగంగా వుంచేశారు.

అన్ని రంగాల మాదిరిగానే పర్యాటక రంగాన్ని కూడా గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. జిల్లాలో అనే ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు వున్నప్పటికీ పట్టించుకోలేదు. అప్పటికే ఉన్న పర్యాటక ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, నిర్వహణ లోపించడంతో అధ్వానంగా తయారయ్యాయి. మరోవైపు అనకాపల్లి సమీపంలో వున్న ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్న కొండను పర్యాటకంగా, అధ్యాత్మికంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించగా, వాటిని సద్వినియోగం చేసుకోవడంలో నాటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

బొజ్జన్న కొండ కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ పరిధిలో వుంది. నిత్యం ఎంతో పర్యాటకులు సందర్శిస్తుంటారు. కొండపైన, గుహ లోపల శిల్ప సంపద, బుద్ధుని విగ్రహాలు, ధాన్య మందిరాలు, బౌద్ధ భిక్షువులు ఆవాసం వుండడానికి పెద్ద పరిమాణంలోగల ఇటుకలతో నిర్మించిన ప్రదేశాలు ఆకట్టుకుంటాయి. ప్రతి ఏటా కనుమ పండుగ రోజున మేళా నిర్వహిస్తుంటారు. దేశ విదేశాల నుంచి బౌద్ధభిక్షువులు ఇక్కడకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తుంటారు. దీంతో బొజ్జన్న కొండను పర్యాటకంగా, అధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం భావించింది. 2022లో రూ.7 కోట్లు మంజూరు చేసింది. ధ్యాన మందిరం, ఎమినిటీ సెంటర్, లేజర్ షో, సౌండ్ అండ్ లైటింగ్ షో, పార్కు, రహదారులు, లైట్లు ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేయాలని ప్రణాళిక రూపొందించింది. ఈ పనులు చేసే బాధ్యతను నాడు రాష్ట్రంలో అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వానికి అప్పగించింది. రూ.1 కోటి 27 లక్షల వ్యయంతో ఎమినిటీ సెంటర్ భవనాన్ని నిర్మించారు. పర్యాటకులకు గైడ్ చేసేందుకు లైట్ అండ్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు పనులు చేయలేదు. లేజర్ షో పనులు సైతం చేపట్టలేదు. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిఇన సోలార్ లైట్లకు రక్షణ లేకపోవడంతో దొంగలపాలవుతున్నాయి. మరోవైపు ... మిగతా 8వ పేజీలో

అరకు చలి ఉత్సవ్‌కు సర్వం సిద్ధం

నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఐటీడీఏ పీవో



అరకు చలి ఉత్సవ్‌కు సిద్ధమైన ప్రధాన వేదిక

అరకులోయ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న అరకు చలి ఉత్సవ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, ఇతర అధికారులు ఇక్కడకు వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవ్‌లో గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉండాలని, గిరిజన వంటకాలు, అరకు కాఫీని పర్యాటకులకు రుచి చూపించాలన్నారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఉత్సవ్ ప్రధాన కేంద్రం నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకూ మారథాన్ నిర్వహించనున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కాగా లోతేరు రోడ్డులో వజ్రాలకొండకు ఎదురుగా ఉన్న హెలిప్యాడ్ వద్ద విహంగ్ అడ్వంచర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెలికాప్టర్ రైడ్‌ను కలెక్టర్, జేసీ, సబ్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ధీరజ్, టూరిజం ఆర్‌డీలతో కలిసి వారు హెలికాప్టర్‌లో విహరించారు.

విశాఖ డెయిరీపై రైతుల కన్నెర్ర

పాల సేకరణ తగ్గింపు దిశగా అడుగులు

- ఆవు పాల ధర గతంలోనే లీటరుకు రూ.4 కోత
- ఇప్పుడు సేకరణలో పది శాతం తగ్గింపు
- త్వరలో గేదె పాలకూ ఇది వర్తింపు
- వారానికి ఒక రోజు 'మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ హాలిడే?
- నోరు మెదపని పాల సంఘాల పాలకవర్గాలు, డెయిరీ డైరెక్టర్లు
- కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని రైతులు వినతి



విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం

చోడవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):

రైతుల నుంచి క్రమేపీ పాల సేకరణను తగ్గించాలని విశాఖ డెయిరీ యాజమాన్యం భావిస్తున్నట్టు తెలిసింది. ఆవు పాల సేకరణ ధరను నాలుగు నెలల క్రితం తగ్గించగా, కొద్ది రోజుల నుంచి ఆవు పాల సేకరణను కూడా తగ్గించేసింది. రైతులు ఆయా కేంద్రాలకు తీసుకువస్తున్న పాలలో లీటరుకు వంద మిల్లీలీటర్లను వెనక్కు ఇచ్చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. ఇంతటితో ఆగకుండా వారంలో ఒక రోజు 'మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ హాలిడే' (పాల సేకరణకు విరామం) ప్రకటించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో గేదె పాల సేకరణలో కూడా కోత విధించాలని నిర్ణయించినట్టు సమాచారం.

పాల సేకరణ విషయంలో ... మిగతా 8వ పేజీలో

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



సుజాత, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

అనకాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):

ఇంటర్మీడియట్ బోర్డు జారీచేసిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు 88 జూనియర్ కళాశాలను కేంద్రాలుగా ఎంపిక చేశామని, పరీక్షల నిర్వహణపై ఆయా అధ్యాపకులకు ఇప్పటికే అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు. అక్రమాలకు తావు లేకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రాక్టికల్ పరీక్షల పర్యవేక్షణకు ఒక హైపవర్ కమిటీతోపాటు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టు ఆమె తెలిపారు. ఆయా తేదీల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి ఈ ఏడాది ఎంపీసీ విద్యార్థులు 6,112 మంది, బైపీసీ విద్యార్థులు 3,162 మంది, ఒకేషనల్ కోర్సుల నుంచి 4,695 మంది.. మొత్తం 13,969 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారని ఆమె తెలిపారు.

చెరువు మీదుగా హైవే పనులు

- అడ్డుకున్న సబ్బవరం పంచాయతీ శివారు గ్రామాల రైతులు



ఇంటర్ చేంజ్ రోడ్డు నిర్మాణం కోసం తవ్వేసిన చెరువు గర్భాన్ని పరిశీలిస్తున్న రైతులు

సబ్బవరం, జనవరి 30 ఆంధ్రజ్యోతి):

విశాఖ-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా మండలంలోని చిన్నయ్యపాలెం వద్ద జరుగుతున్న ఇంటర్ చేంజ్ (సింగిల్ ట్రంపెట్) పనులను సబ్బవరం శివారు గ్రామాల రైతులు గురువారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు కొటాన అప్పారావు, గొర్లి అచ్చింనాయుడు, తదితరులు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా సాగునీటి చెరువులో నుంచి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. సర్వే నంబరు 109లో 15.9 ఎకరాల్లో పెదనాయుడు చెరువు ఉందని, దీనిని ఆనుకొని అనకాపల్లి-ఆనందపురం హైవేకు, షీలానగర్- సబ్బవరం సాగరమాల రోడ్డును అనుసంధానం చేస్తూ ఇంటర్ చేంజ్ నిర్మిస్తున్నారని చెప్పారు. చెరువుకు చెందిన సుమారు 2.3 ఎకరాలు ఇంటర్ చేంజ్ నిర్మాణానికి అవసరం అవుతుందని, ఇందుకు ప్రతిగా జిరాయితీ భూమిని కొనుగోలు చేసి చెరువు తవ్వి ఇస్తామని గతంలో ... మిగతా 8వ పేజీలో



బ్రాండిక్స్ కంపెనీ మెయిన్ గేటు ముందు ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బ్రాండిక్స్ ఉద్యోగులు ఆందోళన

విధులు బహిష్కరించి మెయిన్ గేటు ఎదుట బైఠాయింపు

- రోజుకు అర్ధ గంటపాటు పని వేళలు పెంచిన యాజమాన్యం
- శాశ్వత ఉద్యోగులకు రూ.1,000, ఇతరులకు రూ.700 పెంపు
- అంగీకరించని ఉద్యోగులు

అచ్యుతాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):

ప్రత్యేక ఆర్థిక మండలిలోని బాండ్రిక్స్ బ్రాండిక్స్ (అధిస్థాన్ సమీకృత పారిశ్రామిక పార్కు) కంపెనీ యాజమాన్యం పని గంటలు పెంచినందుకు నిరసనగా ఉద్యోగులు గురువారం విధులు బహిష్కరించి ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. కంపెనీలో ఇంతవరకు ఉద్యోగులకు ఎనిమిది గంటల పనివిధానం ... మిగతా 8వ పేజీలో

ఇంటర్వ్యూ..

బెల్ట్ దుకాణాలపై ప్రత్యేక నిఘా

పి. తేజో వెంకట కుమార్, సీఐ, ఎక్సైజ్ శాఖ, ఎలమంచిలి



(ఆంధ్రజ్యోతి/ఎలమంచిలి)

ప్రశ్న: సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ నేరాలు లేకుండా తీసుకుంటున్న చర్యలు?

జవాబు: ఎలమంచిలి ఎక్సైజ్ శాఖ పరిధిలో ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఎక్సైజ్ నేరాలు కట్టడికి పక్కా వ్యూహంతో చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయకుండా తీసుకుంటున్న చర్యలేవి?

జవాబు: గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించినా.. అందుకు వేలం పాటలు నిర్వహించినా.. చర్యలు తీసుకుంటాను. ఇప్పటికే అన్ని గ్రామాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇకపై పక్కా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సారా నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు: ఎక్సైజ్ సర్కిల్‌లోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేశారు. సారా ఆనవాళ్లు లేకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం.

ప్రశ్న: ప్రధానంగా గంజాయి, మత్తు పదార్థాలు వినియోగం లేకుండా తీసుకుంటున్న చర్యలేమి..?

జవాబు: గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే తమకు ఇవ్వాలి. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుంది.

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నేత శ్రీను



మునగపాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం విజయవాడ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు తెలిపారు. టీడీపీ సభ్య నమోదు వివరాలను సీఎంకు వివరించినట్టు చెప్పారు. పార్టీలో కష్టంచి పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారన్నారు.

'చెరువులోకి మురుగు నీరు'

రాంబిల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురం సమీపంలోని ఉన్న ఎన్ఏఓబీలోని ఐటీడీ లేబర్ కాలనీలోని వృఽథా కలుషిత నీటిని నేవీ ప్రహరీ కింద నుంచి పైడమ్మ చెరువులోకి వదిలేస్తున్నారని వాడనర్సాపురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెల్లూరి దేముడు ఆరోపించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కలుషిత నీరు చెరువులోకి విడిచిపెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల గ్రామస్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అధికారులు ఇక్కడి పరిస్థితిని పరిశీలించి, చర్యలు తీసుకోవాలని దేముడు కోరారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ఎస్.రాయవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గౌరి పరమేశ్వరుల సారె ఊరేగింపు గురువారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. మహిళలు పలు రకాల పిండి వంటలను సారెగా తయారుచేసి వాటిని గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి గౌరీ పరమేశ్వరులకు సమర్పించారు. ఫిబ్రవరి ఒకటవ తేదీన గౌరీ పరమేశ్వరుల ఉత్సవమూర్తుల ఊరేగింపును నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోటీల్లో సత్తా చాటిన డిగ్రీ విద్యార్థులు

నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అనేక బహుమతులు గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య చెప్పారు. వాలీబాల్, త్రో బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రిన్సిపాల్ శివయ్య అందజేశారు. కోచ్‌లు రాంబాబు, చిరంజీవి, ఫిజికల్ డైరెక్టర్ కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పూడిమడక తీరంలో తాబేలు కళేబరం

అచ్యుతాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పూడిమడక తీరానికి తాబేళ్ల కళేబరాలు నిరంతరాయంగా కొట్టుకు వస్తున్నాయి. గత నెల రోజుల నుంచి తంతడి-పూడిమడక మధ్య గల తీరంలో 70 వరకు తాబేళ్ల కళేబరాలు కొట్టుకు వచ్చాయి. గురువారం మరో తాబేలు కళేబరాన్ని మత్స్యకారులు గుర్తించారు. కర్మాగారాల్లో విడుదలైన రసాయనాలు సముద్ర జలాల్లో కలవడం వల్లే తాబేళ్లు మృతి చెందుతున్నాయని, ఇదే కొనసాగితే భవిష్యత్తులో చేపలు కూడా దొరకవని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి

ఎలమంచిలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బీఎస్. బంగారుశెట్టి కోరారు. గురువారం పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని



అచ్యుతాపురంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం వాసవీమాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఆర్య వైశ్యులకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించినట్టయిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ఆరెపు గుప్తా, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు మొగలపల్లి కాశీ, కట్టా వెంకట సత్యనారాయణ, కట్టమూరు బసవరాజు, కట్టా ఆదినారాయణ, కొనగళ్ల పరమేశులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని పీఎన్ఆర్‌పేట ఎంపీయూపీ స్కూలులో గాంధీజీ చిత్రపటానికి హెచ్ఎం. బీవీ.ధనలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు రవీంద్ర, కృష్ణవేణి, శ్రీనుబాబు, సూర్యప్రభ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

మండల కేంద్రంలో మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం ఘనంగా జరిపారు. మండల కాంప్లెక్స్‌లోని పోలీస్ గెస్ట్ హౌస్ వద్ద గల గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో



ఎలమంచిలిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బంగారుశెట్టి

కూండ్రపు వెంకునాయుడు, రాజాన అప్పారావు, ధర్మిరెడ్డి నాయుడు బాబు, గొలగాని అప్పారావు, టింకు, కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలోని రాజుపేట యూపీ స్కూల్ ప్రాంగణంలో గురువారం హెచ్ఎం ఆర్. నానిమణిమోహన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి గ్రామసర్పంచ్ బోడ్డేటి వెంకటరమణ పులమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌డీవీ ప్రభాకర్, ఎస్. సంగీతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో పనివేళల పెంపుపై నిరసన

రాంబిల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ ఉద్యోగులు ఫిబ్రవరి 1 నుంచి అదనంగా అర గంట పనిచేయాలని తీసుకున్న నిర్ణయాన్ని కంపెనీ యాజమాన్యం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, మండల కన్వీనర్ చందక రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా గురువారం సీఐటీయూ నాయకులు మండల కేంద్రంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వస్తున్న మహిళా ఉద్యోగుల మీద పనిభారం మోపడం బాధాకరమన్నారు. అరగంట అదనంగా పనిచేయకుంటే రాజీనామా చేసి వెళ్లిపొండి అంటూ కంపెనీ యాజమాన్యం బెదిరించడం సరికాదన్నారు. కంపెనీలో 8 గంటల పని విధానాన్ని మాత్రమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో నేతలు ఆర్.రాంబాబు, వై.రాము, తదితరులు పాల్గొన్నారు.



రాంబిల్లిలో నిరసన చేస్తున్న సీఐటీయూ నాయకులు

సెజ్ పరిశ్రమల్లో పని గంటలు అమలు చేయాలి : బోదెపు

ఎలమంచిలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్ పరిశ్రమల్లో కార్మికులకు పని గంటలు కార్మిక చట్టాలకు అనుగుణంగానే అమలు చేయాలని ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వైసీపీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బ్రాండిక్స్ ప్రధాన ద్వారం వద్ద కార్మికులకు ఆందోళనకు ఆయన మద్దతు ప్రకటించారు. బ్రాండిక్స్‌లోని ఓ విభాగంలో శ్రమ దోపిడీ జరుగుతుందని ఆరోపించారు. కార్మిక చట్టాలకు లోబడి మాత్రమే యాజమాన్యాలు వ్యవహరించాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో కౌన్సిలర్లు రాపేటి సంతోష్, మరిడేశ్వరావు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో జాప్యం కుదరదు : ఎంపీడీవో

నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి ఒకటో తేదీన మండలంలోని పెన్షన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో డి. సీతారామరాజు హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకటో తేదీన ఉదయం 6 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించి,అదే రోజు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్సీ కోడ్ అమలులో వున్నందున గ్రామాల్లో పొలిటికల్ ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు.

రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలి

పాయకరావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, పట్టణంలో వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సీహెచ్ఆర్‌కే.వర్మ తెలిపారు. పట్టణంలో ఎక్కడ కూడా రాజకీయ పార్టీల, నాయకుల ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. పట్టణంలో వీటిని ఏర్పాటుచేసిన వారు వెంటనే తొలగించాలని లేకుంటే పంచాయతీ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు తొలగించి, స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

వేటూరి పురస్కారం నా పూర్వజన్మ సుకృతం : సుద్దాల అశోక్ తేజ

తుని రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు నేలపై వేటూరి సాహితీ పురస్కారం పొందడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా ఏటా నిర్వహించే వేటూరి సాహితీ పురస్కార వేడుక తుని చిట్టూరి మెట్రోలో బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ప్రముఖులు, వేటూరి సాహితీ అభిమానుల మధ్య నిర్వాహకులు సుద్దాల అశోక్‌తేజకు వేటూరి పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గేయ రచయిత సుద్దాల అశోక్ మాట్లాడుతూ వేటూరి వంటి మహనీయుని జయంతిని తునిలో ఇంత వైభవంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింద న్నారు. 1994లో సినీ రంగంలోకి ప్రవేశించానని, ఎన్నో పాటలు ప్రయోగాలతో నేటికీ మూడు వేలకు పైబడి పాటలు రచించానన్నారు. తన తండ్రిలో ఉన్న విప్లవ పదజాలం, ఆత్రేయ గారి సరళి వలనే తన పాటలకు ప్రత్యేకమైన గుర్తింపుని, వేటూరి వంటి మహనీయులు తమకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సినీ దర్శకుడు శేఖర్ కమ్ములతో కలిసి సాహితీ అభిమానులు 150 పుస్తకాలతో సుద్దాల అశోక్‌తేజను ఘనంగా సత్కరించారు. అనంతరం శేఖర్ కమ్ముల మాట్లాడుతూ సుద్దాల అశోక్‌తేజ ఈ పురస్కారానికి అర్హులని, ఈ వేడుకలో పాలుపంచుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ సాహితీ పీఠం ద్వారా ప్రతి ఏటా పురస్కారాలు ప్రదానం చేయడం వేటూరికి తాము ఇచ్చే నివాళిగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కా సూర్యనారాయణ, వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మ పాల్గొన్నారు.



సుద్దాల అశోక్ తేజ దంపతులను సత్కరించిన దృశ్యం

కాలుష్యం నుంచి తాబేళ్లను కాపాడాలి

▸▸ జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ

నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాలుష్యం నుంచి తాబేళ్లను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా వుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, పార్టీ నాయకుడు గెడ్డం బుజ్జి చెప్పారు. గురువారం బోయపాడు తీరంలో పర్యావరణవేత్త డాక్టర్ రాజేంద్ర సింగ్‌తో కలిసి పర్యటించారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళతామన్నారు. కాలుష్యం కారణంగా సముద్రంలో తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు చెప్పారన్నారు. తీరం వెంబడి ఇటీవల మృత్యువాత పడ్డ తాబేళ్లను పరిశీలించారు. జనసేన మండల అధ్యక్షుడు వెలగా సుధాకర్ పాల్గొన్నారు.



బోయపాడు తీరంలో పర్యటించిన పర్యావరణవేత్త రాజేంద్రసింగ్, జనసేన నేతలు బొలిశెట్టి, గెడ్డం బుజ్జి

పూడిమడకలో కాలుష్య నియంత్రణ మండలి ఏఈ పరిశీలన

అచ్యుతాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పూడిమడక-సీతపాలెం మధ్యలో గల కాలువను కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సూర్యకళ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ కాలువ సెజ్‌లోని కర్మాగారాల ప్రాంతం నుంచి సీతపాలెం గ్రామాన్ని ఆనుకొని పూడిమడక ఉప్పుటేరులో కలుస్తుంది. కర్మాగారాలు రాకముందు ఈ కాలువ గుండా మంచినీరు ప్రవహించేది. ఈ కాలువలో మత్స్యకారులు చేపలు కూడా పట్టేవారు. ప్రస్తుతం ఈ కాలువ వ్యర్థాల నీటితో పూర్తిగా నలుపుగా మారిపోయింది. ఈ కాలుష్యకారక నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తోంది. దీనిపై మత్స్యకారులు కొంతకాలంగా పోరాటం చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. గురువారం ఏఈ సూర్యకళ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.



పూడిమడకలో పరిశీలన జరుపుతున్న కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సూర్యకళ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల కింద చెట్లు నరికివేతకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం రోడ్, కొసెంపాలెం, కుమారపురం, దుప్పితూరులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వమ్మవరం, గెడ్డపాలెం, కొరుప్రోలు ఏజీఎల్ ప్రాంతాలు, ఎస్. రాయవరం, దార్లపూడి, పెదగుమ్ములూరు, పి.ధర్మవరం గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ఆయన చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

నక్కపల్లిలో..

మండలంలోని ఉపమాక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మరమ్మతు పనుల నిమిత్తం పది గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్, ఏఈ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కపల్లి, ఉపమాక, చందనాడ, చినతీనార్ల, పెదతీనార్ల, జానకయ్యపేట, సీహెచ్ఎల్ పురం, కాగిత, న్యాయంపూడి, రాజయ్యపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా వుండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం : డిప్యూటీ డీఈవో

ఎస్.రాయవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా శత శాతం ఉత్తీర్ణత సాధించడమే ఉపాధ్యాయుల లక్ష్యంగా ఉండాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. మండలంలోని గుడివాడ జడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులందరూ పది పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను గుర్తించారు. అలాగే ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిప్యూటీ డీఈవో అప్పారావు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగన్నదొర, పీడీ కుందూరు రాజు, ఉపాధ్యాయులు మహేశ్వరి, సుధాలక్ష్మి, భవాని, పద్మావతి పాల్గొన్నారు.



గుడివాడ పాఠశాలలో విద్యార్థిని పుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

గుల్లిపాడు రైల్వే బ్రిడ్జికి స్థల పరిశీలన

నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లిపాడు రైల్వే క్రాసింగ్ గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి నర్సీపట్నం ఆర్‌డీవో వీవీ రమణ గురువారం స్థల పరిశీలన చేశారు. గుల్లిపాడు ఎల్‌సీ గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్న ప్రతిపాదన మేరకు రైల్వేశాఖాధికారులతో కలిపి ఆర్డీవో రమణ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. భూముల సర్వే చేయమని సర్వేయర్‌ను ఆదేశించారు. దీనిపై సమగ్ర నివేదికను రైల్వేశాఖాధికారులకు పంపిస్తామన్నారు. మరో రెండు విడతలు పరిశీలన చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటామని ఆర్డీవో రమణ చెప్పారు.



భూముల మ్యాప్‌లను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

10, 11 తేదీల్లో ఇన్‌ల్యాండ్ ఫిష్ సహకార సంఘాల ఎన్నికలు

పాయకరావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకంపేట, పాల్మన్‌పేట ఇన్‌ల్యాండ్ ఫిష్ సహకార సంఘాల ఎన్నికలు వచ్చే నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తామని ఎన్నికల అధికారిణి టి.నాగమణి తెలిపారు. గురువారం ఈ మేరకు ఆమె వివరాలు అందజేశారు. మండలంలోని పాల్మన్‌పేటకు చెందిన శ్రీరామాంజనేయ మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి ఫిబ్రవరి 10వ తేదీన, అంకంపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి 11వ తేదీన ఎన్నికల నిర్వహిస్తామన్నారు. ఎన్నికల తేదీ రోజునే నామినేషన్లు స్వీకరణ, తర్వాత ఎన్నికలు, అనంతరం ఫలితాలు ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈఎన్నికలు సభ్యులు చేతులెత్తే విధానం ద్వారా నిర్వహిస్తామన్నారు.

పశు కిసాన్ క్రెడిట్ కార్డుతో సబ్సిడీ రుణాలు

అచ్యుతాపురం, జనవరి 30 (ఆన్‌లైన్): పశు కిసాన్ క్రెడిట్ కార్డు సహాయంతో రైతులు సబ్సిడీ రుణాలు పొందవచ్చని దోసూరు పశువైద్యాధికారి కె. శివకుమార్ తెలిపారు. గురువారం దుప్పితూరులో ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పశుగ్రాసం సాగుకు అవకాశం ఉందన్నారు. ఈ శిబిరంలో 70 పశువులకు వైద్య చికిత్సలు, వంద మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి. నాగేశ్వరరావు, రవిచంద్ర, రామారావు, కాసుబాబు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రేబాక గూడుపమ్మతల్లి క్షేత్ర ప్రారంభానికి ఆహ్వానాలు

నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలం రేబాకలో దాతల సహకారంతో అద్భుతంగా నిర్మించిన గూడుపమ్మతల్లి క్షేత్ర ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రూ. కోటితో నిర్మించిన ఈ ఆలయాన్ని ఫిబ్రవరి 7వ తేదీన ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు. ఆలయ ధర్మకర్త, వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టుముక్కల శ్రీహరిరాజు గురువారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను కలిసి ఆలయ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. అదేవిధంగా హోం మంత్రి అనిత, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నారు.

8న షడ్భుజ వేంకటేశ్వరా ద్విశతి ఆవిష్కరణ

నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 30 మంది పండితులు రచించిన 'షడ్భుజ వేంకటేశ్వరా' ద్విశతి పద్యకావ్యం గ్రంథావిష్కరణ ఫిబ్రవరి 8న ఉపమాక వెంకన్న సన్నిధిలో జరుగుతుందని ప్రముఖ రచయిత్రి డాక్టర్ గాయత్రీదేవి గురువారం తెలిపారు. అనంతచ్ఛందం, తరిగొండ వెంగమాంబ సాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి తిరుపతికి చెందిన ప్రముఖ అవధాని ఉప్పలధడియం భరత శర్మ, తోపెల్ల బాల సుబ్రహ్మణ్యశర్మ హాజరవుతారని ఆమె చెప్పారు. ప్రపంచంలోనే అన్ని చిన్న వయస్సులోనే 16 ఏళ్లకే భరత శర్మ శతావధానం చేసి ప్రపంచరికార్డు నెలకొల్పారని ఆమె చెప్పారు. విశిష్టమైన షడ్భుజ వేంకటేశ్వరా ద్విశతి పద్య కావ్యం ఆవిష్కరణ అనంతరం భరత శర్మ అవధానం వుంటుందన్నారు.

టెన్త్ విద్యార్థులకు నమూనా పరీక్ష



టెన్త్ నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

పాయకరావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ నమూనా పరీక్ష జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం డీఎస్.భవానీ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి నమూనా పరీక్షలు రాయడం వలన పబ్లిక్ పరీక్షలపై భయం పోతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, రత్నమణి, వరలక్ష్మి తదితరులతోపాటు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు పెరుగుతున్న ఆదరణ : సుందరపు



జనసేన పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రజాసేవ కారణంగా పార్టీకి ప్రజల్లో రోజురోజుకి ఆదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో మోసయ్యపేట పాఠశాల చైర్మన్, వైసీపీ నేత చిట్టి తాతారావుతోపాటు 15 మంది వైసీపీ నాయకులు జనసేనలో చేరారు. వీరందరికీ విజయకుమార్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జనసేనలో చేరిన వారిలో కృష్ణ, విజయ్, నాని, రాము, శివ, శ్రీను, సింహాద్రి, తదితరులున్నారు. కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

చందనాడలో లేగదూడల ప్రదర్శన

నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందనాడ గ్రామంలో గురువారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. నక్కపల్లి ఏడీ డాక్టర్ వీర్రాజు, పశువైద్యాధికారిణులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ ఆర్.కృపావతి లేగ దూడల ప్రదర్శన గురించి వివరించారు. ఈ ప్రదర్శనలో మూడు లేగ దూడులను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేసి, రైతులకు వాటిని అందజేశారు.

'నక్కపల్లిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుచేయాలి'

నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక 50 పడకల ఆస్పత్రిలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ ఎం.రాజేశ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సీపీఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరచూ హైవేపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ లేనందున , క్షతగాత్రులను విశాఖ తీసుకెళ్లడంలో కాలయాపన జరుగుతోందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, బీసీ సంక్షేమ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇందులో మైలపల్లి లోవరాజు, గొర్ల రమణ, దండుబాబు, మనబాల అప్పలరాజు, యాదగిరి నవీన్, కొర్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో సుస్థిర పాలన

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. పరమేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

మునగపాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో సుస్థిర పాలన అందుతోందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. మండలంలోని ఉమ్మలాడలో గురువారం సంధావన్ గౌరవ దివాస్ అభియాన్ కార్యక్రమం జరిగింది. తొలుత బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాజ్యాంగబద్ధంగా మోదీ పాలన జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మళ్ల కాళీశ్వరరావు, కొండ మాస్టర్, జేవీఎస్ వర్మ, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి ప్రచారం



చినదొడ్డిగల్లులో టీచర్లను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ

నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానిక కేజీబీవీ, గురుకులం సహా అనేక పాఠశాలల్లో వున్న ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు ధర్మారావు, డి.కొండలరావు, కర్రి వీరభద్రరావు, శ్రీనివాసరావు, సునీల్, కృష్ణ, అప్పలరాజు, ఎస్.ఫాల్గుణరావు, బి.సింహాచలం, రంగబాబు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

మునగపాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా గురువారం తులసీ కళావేదికపై జరిగిన కార్యక్రమంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే గ్రామానికి పలు విధాలుగా సేవలందించిన 20 మంది పెద్దలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్‌కు మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ డీవీ.సూర్యనారాయణరాజు శుభాకాంక్షలు తెలిపారు.

కోట్నివీధి, లక్ష్మీనారాయణనగర్‌లలో
కుక్కల పట్టివేత

- ఇటీవల 'ఆంధ్రజ్యోతి'ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' చర్చా వేదిక నిర్వహణ
- కుక్కల సమస్యపై ఏకరువు పెట్టిన పలువురు మహిళలు
- వెంటనే స్పందించి నియంత్రణ చర్యలు చేపట్టిన జీవీఎంసీ


కోట్నివీధి, లక్ష్మీనారాయణనగర్‌లలో కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది



అనకాపల్లి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 84వ వార్డు పరిధి కోట్నివీధి, లక్ష్మీనారాయణ నగర్‌లలో పారిశుధ్య విభాగం అధికారులు కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టారు. కోట్నివీధి రామాలయ కల్యాణ మండపంలో మంగళవారం 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన చర్చా వేదికలో పలువురు మహిళలు కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై స్పందించిన జీవీఎంసీ శానిటేషన్ సూపర్వైజర్ ఆర్.రవికుమార్ గురువారం ఆయా ప్రాంతాల్లో కుక్కలను దగ్గరుండి సిబ్బందితో పట్టించారు. ఐదు కుక్కలను పట్టుకున్నామని, వీటిని విశాఖపట్నం తరలించి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించి పరిశీలనలో ఉంచుతామన్నారు. అనంతరం ఎక్కడ పట్టినచోట అక్కడే వాటిని విడిచిపెడతామని చెప్పారు. ఈ కుక్కల పట్టివేత నిరంతరం కొనసాగిస్తామని వివరించారు.

'వియాష్ ఫార్మా' పైప్‌లైన్ నుంచి వ్యర్థ రసాయనాలు లీక్

- దుర్వాసన వెదజల్లుతుండడంతో జనం ఇబ్బందులు
- యాజమాన్యంపై చర్యలకు సీఐటీయూ నేత 'గనిశెట్టి' డిమాండ్


వ్యర్థ రసాయనాలు లీకైన పైపులైన్ ఇదే

పరవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఫార్మా సిటీలోని వియాష్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ యూనిట్-2 పైప్‌లైన్ నుంచి గురువారం వ్యర్థ రసాయనాలు లీక్ కావడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. రసాయనాలు లీకవడానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. భారీ ఎత్తున రసాయనాలు బయటకు రావడంతో అటుగా రాకపోకలు సాగించే వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని యాజమాన్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

నవోదయ మోడల్ టెస్టులో ప్రతిభావంతులకు సత్కారం


విద్యార్థులకు షీల్డ్‌లను బహూకరించిన పీఆర్‌టీయూ ప్రతినిధులు

తుమ్మపాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన నవోదయ మోడల్ టెస్ట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ గురువారం ఇక్కడ షీల్డులు, ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి మోడల్ టెస్ట్ నిర్వహించగా, సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాజరైనట్టు చెప్పారు. అనకాపల్లి జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 286 మంది పరీక్ష రాశారన్నారు. వీరిలో అధికంగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులను సత్కరిస్తున్నట్టు చెప్పారు. ఇటువంటి పరీక్షలు రాయడం ద్వారా విద్యార్థులు మరింత నైపుణ్యం సంపాదిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెద్దినాయుడు, గొర్లి అర్జున, ఏవీ రామచంద్రరావు, దాసరి నూకరాజు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ రోడ్డులో రక్షణ చర్యలకు ఆందోళన


ఏలేరు కాలువ వద్ద నిరసన తెలియజేస్తున్న దృశ్యం

తుమ్మపాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండకు వెళ్లే రోడ్డు పక్కనే గల ఏలేరు కాలువకు రక్షణ గోడలు నిర్మించాలని ఆమ్ ఆద్మీపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరినాథబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానికులతో కలిసి ఏలేరు కాలువ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు కాలువకు రక్షణ గోడలు, ఫెన్సింగ్ వంటివి లేకపోవడంతో తరుచూ ఈ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బుధవారం తుమ్మపాలకు చెందిన వ్యక్తి ఈ రోడ్డులో కేవలం రక్షణ చర్యలు లేకపోవడం వల్లనే నేరుగా బొలేరా వాహనంతో ఏలేరు కాలువలోకి దూసుకువెళ్లి మృతి చెందాడని వాపోయారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి రక్షణ గోడలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా మరుగుదొడ్లకు తాళాలు

- పరవాడ, వాడచీపురుపల్లిలో రూ.33 లక్షలతో సింహాద్రి ఎన్టీపీసీ నిర్మాణం
- నిర్వహణ బాధ్యతలు పంచాయతీల చేతికి వెళ్లడంతో నిరుపయోగం


పరవాడలో తాళాలు వేసి ఉన్న సామాజిక మరుగుదొడ్లు

పరవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ, వాడచీపురుపల్లిలలో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో మూడు నెలలుగా మూతపడ్డాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బహిరంగ ప్రదేశాలు, రహదారుల పక్కనే కాలకృత్యాలు తీర్చుకోవాల్సి దుస్థితి ఏర్పడింది. ఇందుకు సంబంధించిన వివరాలివి.

రూ.33లక్షలు వెచ్చించి ఎన్టీపీసీ నిర్మాణం

సింహాద్రి ఎన్టీపీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.33 లక్షలు వెచ్చించి గ్రామీణ ప్రజల అవసరాల నిమిత్తం 2021 జూలైలో పరవాడ, వాడచీపురుపల్లిలలో సామాజిక మరుగుదొడ్లను నిర్మించింది. ఒక్కో దానికి రూ. 16.5 లక్షలు చొప్పున వెచ్చించి నిర్మాణాలను పూర్తి చేసింది. మూడేళ్ల పాటు సదరు సంస్థ సీఎస్ఆర్ విభాగమే నిర్వహణ బాధ్యతలను చేపట్టింది. స్థానిక ప్రజాప్రతినిధుల సూచన మేరకు ఒక్కో సామాజిక మరుగుదొడ్డి వద్ద ఇద్దరు చొప్పున పారిశుధ్య కార్మికులను నియమించింది. ఒక్కొక్కరికి నెలకు రూ. ఎనిమిది వేలు చొప్పున వేతనాలు చెల్లించేది. గత ఏడాది అక్టోబరు నెల వరకు నిర్వహణను కొనసాగించింది. అనంతరం పంచాయతీలకు నిర్వహణ బాధ్యతను అప్పగించి తప్పుకుంది.


వాడచీపురుపల్లిలో...

పట్టించుకోని పంచాయతీలు

సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలను సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం పంచాయతీలకు అప్పగించింది. పంచాయతీల ఆధీనంలోకి వచ్చిన వీటిని తెరవడానికి ఆసక్తి చూపించకపోవడంతో గత మూడు నెలలుగా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా మరుగుదొడ్లకు తాళాలు వేసేశారు. ఈ కారణంగా గ్రామీణ ప్రజలకు 'అత్యవసర' కష్టాలు ఆరంభమయ్యాయి. సామాజిక మరుగుదొడ్లను వినియోగించుకోవడం అలవాటు చేసుకోవడంతో ఆయా గ్రామాల్లో రహదారులు, బహిరంగ ప్రదేశాలు బాగుపడ్డాయి. ప్రస్తుతం వీటికి తాళాలు వేయడంతో బహిరంగ ప్రదేశాలు, రహదారుల పక్క ప్రాంతాలను బహిర్భూమిగా మార్చుకుంటున్నారు.

సంతకు వచ్చే వారికి తప్పని అవస్థలు

మండల కేంద్రం పరవాడలో మంగళవారం నిర్వహించే వారపుసంత రోజున ఈ మరుగుదొడ్లను వినియోగించుకునే వారిసంఖ్య ఎక్కువగానే ఉండేదని ఇక్కడి కార్మికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇవి మూతపడడంతో పలువురు తీవ్రఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాడచీపురుపల్లిలో కూడా ఇదే దుస్థితి నెలకొంది. స్థానిక పీహెచ్‌సీకి వచ్చే రోగులతో పాటు సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే కార్మికులు, ప్రయాణికులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



సామాజిక మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో అత్యవసరానికి ఇబ్బందులు పడుతున్నాం. గత్యంతరం లేక పలువురు బహిరంగ ప్రదేశాలను బహిర్భూమిగా వినియోగించుకుంటున్నారు. దీనివల్ల పరిసరాలు దుర్వాసనగా మారుతున్నాయి. ఆయా రహదారుల గుండా రాకపోకలు సాగించే వారంతా ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుంది.

\- కోనేటి మూర్తి, పరవాడ

పంచాయతీలు పట్టించుకోవాలి



మూతపడిన సామాజిక మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. పరవాడ వారపు సంతకు వచ్చే వారితో పాటు మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవస్థలను గుర్తించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవడానికి పంచాయతీ పాలకవర్గం, అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి

\- రొంగలి నాగరాజు, తానాం

జాతిపిత గాంధీజీకి నివాళి

- వర్ధంతి సందర్భంగా సేవలను కీర్తించిన వక్తలు


అనకాపల్లి గాంధీనగరంలో మహాత్ముని విగ్రహానికి కాంగ్రెస్ నాయకుల నివాళి


కశింకోట ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో ఈఈ రామకృష్ణఅంజలి



సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

అనకాపల్లి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పలుచోట్ల గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా అనకాపల్లిలోని గాంధీనగరం మెయిన్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలపురెడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి గాంధీజీ అందించిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తెర శ్రీధర్, కాళ్ల సత్యనారాయణ, పీఎస్ దత్తు, బాల మురళీయాదవ్, తుట్టా రమణ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఎంపీపీ కలగ లక్ష్మి జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీడీవో రవికుమార్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఈఈ రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం శాఖా గ్రంథాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగంలో గాంధీ వర్ధంతిని జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, గ్రంథాలయాధికారిణి వి.శిరీషా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. జాతికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ లెక్కల గణేశ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లగిశెట్టిపాలెంలో పైడితల్లమ్మ తీర్థం


పూజలందుకున్న పైడితల్లి

సబ్బవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలం లోని ఆరి పాక శివారు లగిశెట్టిపాలెంలో పైడితల్లమ్మ తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, గ్రామ పెద్దలు పాలిశెట్టి సురేశ్‌రాజ్, అండిబోయిన పల్లుణ, బంగారయ్య, కొటిరాజు, గొర్లి దేముడుబాబు, రాజేశ్‌లతో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలకు రిఫరీగా 'భీశెట్టి'


భీశెట్టి శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్ రాష్ట్రం రిషికేశ్ వద్ద గల శివపురిలో జరుగుతున్న 38వ జాతీయ స్త్రీ, పురుషుల బీచ్ వాలీబాల్ పోటీలకు అనకాపల్లికి చెందిన భీశెట్టి శ్రీనివాసరావు రిఫరీగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఫిబ్రవరి 14వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీలకు ఆహ్వానపు రిఫరీగా నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు (గణబాబు), కార్యదర్శి భగవాన్‌దాస్ తదితరులు అభినందించారు.

కుష్టు నివారణ పై అవగాహన ర్యాలీ

తుమ్మపాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కుష్టువ్యాధి నివారణపై గురువారం తుమ్మపాలలో పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ నజరత్ షమీమ్ మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉన్నా, చెవులు, వీపుపై ఎర్రటి నొప్పి లేని బొడుపులు ఉన్నా వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. కుష్టువ్యాధి నివారణకు ఉచితంగా మందులు అందిస్తున్నట్టు చెప్పారు. ర్యాలీలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి వాసవీమాత ప్రతిష్ఠా శతజయంత్యుత్సవాల ముగింపు

- ఎనిమిదో తేదీన మహా కుంభాభిషేకం
- వివరాలు వెల్లడించిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ చైర్మన్ బుచ్చిరాజు

అనకాపల్లి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వైభవోపేతంగా జరుగున్న అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి మహోత్సవాల ముగింపు వేడుకలు ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్ తెలిపారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ వేడుకల్లో భాగంగా ఎనిమిదో తేదీన కుర్తాళం సిద్ధేశ్వరి పీఠానికి చెందిన సిద్ధేశ్వర ఆనంద భారతి మహాస్వామి, పీఠం ఉత్తరాధికారి దత్తతేశ్వరానంద భారతి స్వామి ఆధ్వర్యంలో భారీ ఎత్తున మహా కుంభాభిషేకం జరపనున్నామన్నారు. ఆ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుతామన్నారు. ఇదిలావుంటే, నాలుగో తేదీన అమ్మవారి శోభాయాత్ర, ఐదో తేదీన సామూహిక లక్షతులసీ నామార్చనలు, ఆరున నాగేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సుహాసినిల పూజ, ఏడవ తేదీన లక్ష కుంకుమార్చనలు, చండీహోమం వంటివి జరుపుతామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కోరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉపాధ్యక్షులు ఉప్పల రవిరాం జవహర్, గ్రంధి మాణిక్యం, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీలు భర్తీ చేయాలి'


మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారావు

తుమ్మపాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు ఆరోపించారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన ఏఐవైఎఫ్ మహాసభలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీని చేపడతామని హామీ ఇచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా అమలు కావడం లేదని వాపోయారు. ప్రభుత్వ రంగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ గత పదకొండు ఏళ్లలో ఎవరికి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్షుడిగా వేముల కన్నబాబు, కార్యదర్శిగా వియ్యపు రాజు, ఉపాధ్యక్షుడిగా కరక సురేష్, సహాయ కార్యదర్శులుగా జి.ఫణీంద్రకుమార్, డొక్కరి హరీశ్, కోశాధికారిగా జి.రాధాకృష్ణ ఎన్నికయ్యారు. అలాగే, కార్యవర్గసభ్యులుగా ఎం.సత్తిబాబు, బి.బాబ్జి, ఎం.శివ, సంతోష్, జి.చైతన్యలను ఎన్నుకున్నారు. విద్యార్థుల సమస్యలపై భవిష్యత్తులో పోరాటాలు చేస్తామని నూతన కార్యవర్గం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు రామునాయుడు, కె.సన్యాసిరావు, అప్పలరాజు, అర్జునరావు, నరాలశెట్టి సత్యనారాయణ, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస'ంగా అక్షరాస్యులను చేద్దాం

- శిక్షణ శిబిరంలో వివిధ శాఖల సిబ్బందికి ఎంపీడీవో పద్మజ సూచన


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వెలుగు సిబ్బందితో పాటు వివిధ శాఖల అధికారులకు ఏర్పాటైన ఒకరోజు శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, కుటుంబ సంక్షేమంతో పాటు జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యంగా పేర్కొన్నారు. గ్రామాల్లో గల వయోజనులైన వారిని గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు, పాఠశాల, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, ఆయాలు, సహాయకులు, వాచ్‌మెన్ తదితర వర్గాల్లో చదువురాని వారిని గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, వెలుగు ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాలు దూరం

- రహదారి భద్రతపై అవగాహన సదస్సులో సీఐ


ఫ్యాక్టరీలోని అవగాహన సదస్సులో సీఐ స్వామినాయుడు, సిబ్బంది

కశింకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఇక్కడి సాగర్ సిమెంటు ఫ్యాక్టరీ ప్రాంగణంలో కార్మికులు, సిబ్బందికి గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్‌ను విధిగా ధరించాలన్నారు. అనంతరం ఇటీవల జరిగిన లారీ ప్రమాదాలకు గల కారణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, సంస్థ జీఎం ప్రసాద్, ఏజీఎం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

అరకు ఉత్సవ్ ఆహ్వాన పత్రికలో 'అల్లూరి' జిల్లా పేరు ఏదీ?: కాం గ్రెస్

సీలేరు, జనవరి30 (ఆంధ్ర జ్యోతి): అరకు ఉత్సవ్ ఆహ్వాన పత్రికలో అల్లూరి సీతారామరాజు జిల్లా పేరు ప్రస్తావించకపోవ డం మన్యం వీరు డు అల్లూరిని అవమానించడమేనని కాంగ్రెస్ పార్టీ జి ల్లా నాయ కుడు కారే శ్రీనివాస్ విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అరకు ఉత్సవాలను దేశ, విదేశీయులను ఆకర్షించే విధంగా అట్టహాసంగాప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. అయితే, ఆహ్వానపత్రిలో పాడేరు జిల్లాగా ప్రచురించారే తప్పా అల్లూరి జిల్లాగా ము ద్రించలేదన్నారు. స్వాంతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన వీరుడు అల్లూరి పేరుని ఆహ్వాన పత్రికలో ప్రచురిం చకపోవడం బాధాకరమన్నారు. ఇకనైనా అధికారులు ఈ తప్పిదాన్ని సవరించాలని ఆయన కోరారు.

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి పోరాటం: సీపీఎం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చింతపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి సీపీఎం పోరాటానికి సిద్ధమవుతు న్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. గురువారం ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రణాళిక పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రా ష్ట్రాల్లో ఉత్తరాంధ్ర అత్యంత వెనుకబడిన ప్రాంతమ న్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర విభజన సమయంలో శ్రీకృష్ణ కమిషన్ స్పష్టం చేసిందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజి, మౌలిక వసతులు కల్పిం చాలని కమిషన్ ప్రతిపాదించిందన్నారు. నేటికి ఈఅంశాలు అమలు కావడంలేదన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, ప్రత్యే క హోదా, విభజన చట్టం అమలు ప్రస్తావనలేద న్నారు. ఈస్థితిలో పోరాటం చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి పడాల్ పాల్గొన్నారు.

నేడు రెండు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక ఈపీడీసీఎల్ డీఈఈ సన్నిరాంబాబు తెలిపారు. నర్సీపట్నం 33కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో సాంకేతిక మరమ్మతులు నిర్వహించన్నందున జీకేవీధి, చింతపల్లి మండలాల్లో విద్యుత్ వినియోగదారులు అసౌకర్యానికి సహకరించాలని కోరు. ఈ కార్య క్రమంలో ఏఈఈ వనుము ప్రభాకరరావు పాల్గొన్నారు.

28 మినీ గోకులాలు మంజూరు

చింతపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలో తొలివిడతగా 28 మినీ గోకులాలు మంజూరైనట్టు ఉపాధి హామీ పథకం ఏపీవో రాజు తెలిపారు. రెం డు పశువులు కలిగిన గోకులం నిర్మాణానికి రూ.1.15 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు రూ.2.30లక్షలు, 20 మేకలు, గొర్రెల షెడ్ ని ర్మాణానికి రూ.1.5లక్షలు, 50 గొర్రెలు, మేకల షెడ్‌కి రూ.2.3 లక్షలు, వంద కోళ్లకు రూ.87 వేలు, 200 కోళ్ల షెడ్‌కి రూ.1.32 లక్షలు చెల్లిస్తామన్నారు.

ఏనుగుబైలు గ్రామంలో భూముల రీ సర్వే



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సీలేరు, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండ లంలో పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన ఏనుగు బైలులో ఈమేరకు గురువారం జీకేవీధి రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో రీసర్వే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ గ్రామంలో 240.72 ఎకరాల భూమి 56 సర్వే నంబర్లు 104 పట్టాదారులు, అలాగే ప్ర భుత్వ భూమి 74.60 సెంట్లు కలిగి రికార్డుల్లో ఉంది. 110 సంవత్సరాలకు పై బడి ఉ న్న రికార్డుల ఆధారంగా ప్రభుత్వం రీ సర్వేకు ఈ గ్రామాన్ని ఎంపిక చేసింది. మండలంలో ఉన్న 135 గ్రామాల్లోని ఏనుగు బైలు గ్రామంనురీస ర్వేకు ముందుగా ఫీల్డ్ పూరిఫికేషన్ ఆఫ్ రికార్డు (ఎ ఫ్.పి.ఎల్.ఓ.ఆర్) నిర్వహిస్తున్నట్టు డీటీ సత్యనారా యణ ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ బి. శ్రీను,గ్రామసర్వేయర్ ఎం.సతీశ్ కుమార్, వీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

గంజాయి తరలింపు



అనకాపల్లి తరలిస్తున్న గంజాయి మూటలు

పాడేరురూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2022-23లో పట్టుబడిన 32 కేసులకు సంబంధించిన 9,411 కిలోల గంజాయిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధ్వంసం చేసేందు కు గురువారం ఇక్కడినుంచి అనకాపల్లికి తరలించిన ట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ టీవీవీఎస్ఎన్.ఆచారి తెలి పారు. ఈ గంజాయిని శుక్రవారం అనకాపల్లిలో దహనం చేస్తారని ఆయన పేర్కొన్నారు.



పాడేరు శ్రీఅక్షర హైస్కూల్లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆధ్యాత్మికవేత్త సింహాచలం నాయుడు, తదితరులు



నడిమివలస పాఠశాలలో..

బాపూజీ మార్గం.. ప్రపంచానికే ఆదర్శం

పాడేరురూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ అహింసా మార్గం ప్రపంచానికి ఆదర్శనీయమని వక్తలు అన్నారు. గాంధీ 78వ వర్ధంతిని పాడేరులో ఘనంగా ని ర్వహించారు. పట్టణంలో శ్రీ అక్షర హైస్కూల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆధ్యాత్మిక సేవాబృందం జిల్లా చైర్మన్, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నేటి తరం బాపూజీ ఆశయాలు సత్యం, అహింస, శాంతి, సౌభ్రాతృత్వం తదితర వాటిని అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటరత్నం, రామకృష్ణ, ఐ .రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురష్కరించుకొని ఏఎస్ఆర్ సర్కిల్ ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో ఎస్ఈ జీఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో బాపూజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో ఈఈ ఎల్‌సీహెచ్. పాత్రుడు, పాడేరు డివిజన్ ఈఈ ఏవీఎస్ఎం అప్పారావు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము



గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఏపీఈపీడీఎల్ ఎస్ఈ ప్రసాద్

చిట్టిబ్బాయి గాంధీ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. అధ్యాప కులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ప్రిన్సిపాల్ వరగడం శ్రీనివాస రావు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపగానికి నివాళులర్పించారు.కార్యక్రమంలో అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వప్ర సాద్ ఆ ధ్వర్యంలో బాపూజీ వర్ధంతి చేప ట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.భీ మ్‌నాయుడు, కె.జె. రామారావు, దిలీప్ కుమార్, కొండబాబు, కేశవ, కేశవరావు, రాజేశ్, ప్ర సాదరావు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ వర్ధంతి

అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీ నడిమివలస ఎంపీపీ పాఠశాలలోని గురువారం హెచ్ఎం నరాజీ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలోని మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జాతి పిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు.

భూ బదలాయింపు చట్టాన్ని సవరిస్తే ఆందోళన

» గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్

చింతపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భూ బదలాయింపు చట్టాన్ని సవ రించే ప్రయత్నం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ హెచ్చరించారు. గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను ఖండిస్తూ గిరిజన సంఘం నాయకులు ఆం దోళన చేపట్టారు. స్థానిక తహసీల్దార్ బి. రవికుమార్‌కి వినతి పత్రం అంద జేశారు. ఈసందర్భంగా గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ఆదివాసీలకు రాజ్యం కల్పించిన హక్కు భూబదలాయింపు చట్టమన్నారు. ఈచట్టానికి చాలా ప్రాముఖ్యత ఉన్నదన్నారు. భూబదలాయింపు చట్టాని అవహేళన చేస్తూ చట్టాన్ని సవరించేందుకు ప్రభుత్వం ఆలోచించాలని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించడం విచారకరమన్నారు. సభాపతి స్థానం లో ఉండి భూబదలాయింపు చట్టంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం బాధకరమన్నారు. తక్షణమే సభాపతి తన మాటలను వెనక్కి తీసుకుని, గిరిజనులకు క్షమాపణ చెప్పాలన్నారు. సభాపతి బాధ్యతారాహిత్యంగా చట్టాన్ని సవరించాలని మాట్లాడడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించాలని తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశామన్నారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయ కుడు సాగిన చిరంజీవి పడాల్ పాల్గొన్నారు.



చింతపల్లి తహసీల్దార్‌కి వినతి పత్రమిస్తున్న గిరిజన సంఘ నాయకులు

గిరిజన చట్టాల జోలికి వస్తే సహించం

డుంబ్రిగుడ: గిరిజన చట్టాల జోలికొస్తే సహించబోమని ఆదివాసీ గిరి జన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ హెచ్చరించారు. మండ లంలోని అడపవలసలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థులు గ్రామ సమీపంలోని గెడ్డలో దిగి నిరసన వ్యక్తం చేశారు. 1/70చట్టం గిరిజనుల గుండె చప్పుడులాంటిదని అన్నారు. పాలకులు గిరిజన చట్టాల సవరణపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు అక్రమంగా బినామీలతో నిర్మించిన భవనాలు తొలగించాలని కోరారు. అలాగే, గిరిజన చట్టాలు నిర్వీర్యం కాకుండా చూడాలని, లేకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



డుంబ్రిగుడ: గెడ్డలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

గిరిజన చట్టాలను కూటమి ప్రభుత్వం గౌరవిస్తుంది: -జడ్పీటీసీ

అనంతగిరి: గిరిజన హక్కులు, చట్టాలను కూటమి ప్రభుత్వం గౌరవి స్తోందని భావిస్తున్నట్టు స్థానిక జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు ఇటీవల గిరిజన చట్టాలను సవరించాలనే వ్యాఖ్యలపై ఆ యన మాట్లాడారు. ఇలాంటి చర్యలతో గిరిజనులకు హక్కులు, చట్టాలు కనుమరుగైయ్యేపరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. 1/70 యాక్ట్ అనేది గిరిజనులకు ఒక ప్రత్యేక చట్టామని గుర్తు చేశారు.

తీరిన తాగునీటి సమస్య



దుచ్చరపాలెంగరువువీధిలో నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

గూడెంకొత్తవీధి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రింతాడ పంచాయతీ దుచ్చరపాలెం గరువువీధి గ్రామానికి తాగునీటి సమస్య తీరింది. గురువారం గ్రామంలో రూ.8లక్షల నిధులతో నిర్మించిన జల్‌జీ వన్ మిషన్ ఇంటింటికి కొళాయిల పథకాన్ని స్థానిక సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి ప్రారంభించారు. గ్రామంలో 90 గిరిజన కుటుంబాలున్నాయి. వీరు ఏళ్ల తరబడి ఊటనీటితోనే అవసరాలు తీర్చుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌పథకం గ్రామానికి మంజూరైనా, నిధులు వి డుదల చేయకపోవడం వల్ల పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. ఈపథకం అందుబాటులోకి రావడంతో స్థానిక ఆదివాసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నా యకులు కొయ్యం ఇమ్మానుయేలు, టీడీపీ నాయకుడు ఒండ్రంగి సత్యనా రాయణ, పెసా కార్యదర్శి కృష్ణ, గ్రామపెద్ద గుంట రాజారావు పాల్గొన్నారు.

ఫీడర్ అంబులెన్స్‌లో ప్రసవం

ముంచంగిపుట్టు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పస పుట్టు పంచాయతీ చిల్లిపుట్టు గ్రామానికి చెందిన కె.సుభద్ర ఫీడర్ అంబులెన్స్‌లో ప్రసవించారు. ఈ సంఘటనకు సంబంధించి వివరా లు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం సుభద్రకు పురిటి నొప్పులు వచ్చాయి. 108 వాహనా నికి కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. ఆ వాహనం ఆలస్యమవు తుందని అటునుంచి సమాధానం వచ్చింది. దీంతో లబ్బూరు పీహె చ్‌సీ ఫీడర్ అంబులెన్స్‌కు సమాచారం దించారు. దీంతో ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీ హుటాహుటీన చిల్లిపుట్టుకు వెళ్లి గర్భిణీని లబ్బూరీ పీహెచ్‌సీకి తీసుకువస్తుండగా మార్గం మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ సుబ్బారావు ఎంతో చాకచక్యంగా గర్భిణీ తల్లి సహకారంతో ప్రసవం చేశారు. అనంతరం వారిని లబ్బూరు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఆస్పత్రిలో తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. సకా లంలో స్పందించిన ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీకి సుభ ద్ర కుటుంబ స భ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఫీడర్ అంబులెన్స్‌లో గర్భిణీని తరలిస్తున్న దృశ్యం

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

ముంచంగిపుట్టు, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని ఎంపీడీవో శ్రీహర్షసాయి అన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. మం డల కేంద్రంలోని నాలుగు రోడ్ల కు ఇరువైపులా దుకాణదారులు విధి గా చెత్త కుండీలను ఏర్పాటు చేసుకో వాలన్నారు.అలాగే స్థానిక హోలీ క్రీడా మైదానంలో సైతం చెత్త వేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. పరిసరాలు పరిశుభ్రత అందరి బాధ్య త అని, దానికి ప్రతీ ఒక్కరు సహక రించాలని ఆయన కోరారు.

'స్నో'యగాలు!



అనంతగిరిలో మంచు అందాలు



అనంతగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధ ప్రకృతికి ఆలవాలమైన మన్యంలో గురువారం ఉదయం పొగమంచు అందాలు మరింత కనువిందు చేశాయి. విశాఖ- అరకు ఘాట్ రోడ్డు, ఇతర రహ దారుల్లో దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని, ప్రయాణించారు.. పర్యాటకులు మంచు అందాలను ఆస్వాదించారు.

భద్రాచలం బస్సు కిటకిట

» రెండో బస్సు సర్వీసు పునరుద్ధరించక అవస్థలు

సీలేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం బస్సు సర్వీసు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నది. ఒకే ఆర్టీసీ సర్వీసు కావ డంతో పరిమితికి మించి ప్రయాణికులతో ప్ర యాణిస్తుంది. సుదూర ప్రాంతం నిల్చోని ప్రయ ణించాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సీలేరు మీదుగా భద్ర చలంనకు గతంలో విశాఖడిపోనకు చెందిన రెం డు ఆర్టీసీ సర్వీసులు ఉండేవి. అధిక వర్షాల వల్ల రహదారి అధ్వానంగా మారడంతో డంతో కొంత కాలం ఆర్టీసీ సర్వీసులను నిలిపివేశారు. ఈ ప్రాంత ప్రజలు కలెక్టర్ దృష్టి కి తీసుకువెళ్ల డంతో భద్రాచలం రాత్రివేళ సర్వీసును న డుపు తున్నారు. మరో సర్వీసును నేటికీ పునరుద్ధరిం చలేదు. దీంతో ఒకేబస్సు కావడంతో సీట్లు నిండి పోగామరో 20-30మంది నిల్చొనిప్రయాణించా రు.అధికారులు స్పందించి రెండో సర్వీసును పు నరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గురువారం రాత్రి కిక్కిరిసి వెళ్తున్న భద్రాచలం ఆర్టీసీ సర్వీసు

నిండు గర్భిణీకి ఎంత కష్టం

» డోలీలో ఆస్పత్రికి తరలింపు



పొలం గట్లపైనుంచి డోలి సాయంతో గర్భిణీని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతంలో గర్భిణులకు డోలీ కష్టాలు తప్పడంలేదు. ఓ గర్భిణీని ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు గాను సుమారు కిలో మీటరు మేర గట్టులు, పుట్టల వెంట అవస్థలుపడాల్సి వచ్చింది. వివరాలివి.. మండ లంలో గల జర్రెల పంచాయతీ చెరువువీధి గ్రామానికి చెందిన కిల్లో వనితకు నెలలు నిండడంతో గురువారం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆ గ్రామానికి సుమారు కిలోమీటరు వరకు రహదారి సౌకర్యం లేదు. అటుగా వాహనం రాలేని పరిస్థితి. దీంతో భర్త మోహనరావు, కుటుంబ సభ్యుల సహాయంతో డోలీపై వనితను పొలం గట్లు, గుట్టలు దాటుతూ సుమారు కిలోమీటరు వరకు మోసుకొని వచ్చారు. రహదారి సౌకర్యం ఉన్న బొడ్డగొంది నుంచి అంబులెన్స్‌లో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీ హెచ్‌సీ)కి తరలించారు. అనంతరం ఆమెకు వైద్యాధికారి సంతోష్, వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా చెరువువీధి గ్రామస్థులు ప్రసాదు, నాగేశ్వర రావు, భాస్కరరావు, జీనబంధు, మోహన్‌రావు, రఘునాథ్ తదితరులు మాట్లాడుతూ తమ గ్రామానికి సుమారు రహదారి సౌకర్యం లేకపోవడం వలన నిత్యం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలు కారణాలతో రహదారి పనులు జరగలే దని, అధికారులు స్పందించి దీనిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం



చింతపల్లి పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యా ర్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో పీబీవీవీ ప్రసాద్ అన్నారు. గురువా రం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పదోతరగతి విద్యార్థులు విద్యా ప్రగతిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలు మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థు లు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులుకావడానికి విద్యాశాఖ ప్రణాళికను అ మలుపరుస్తుంద న్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఉపాధ్యాయులు వెనుబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాల్లో మెనూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు అందించాలి: సీపీఎం

పెదబయలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పని ముట్లు అందించాలని సీపీఎం మండల అధ్యక్షుడు బొండా సన్నిబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన సీతగుంట పంచాయతీ రోగుల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కూలీలకు తక్షణమే పారా, గునపం, పలుగు తదితర పనిముట్లను ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో టెంట్‌లు, తాగునీరు సౌకర్యం, ప్రథమ చికిత్సకు అవసర మైన మెడికల్ కిట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలోనే పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర పనులను యం త్రాల ద్వారా చేయిస్తున్నారని వాపోయారు. ఫలితంగా జాబ్ కార్డుదారులకు గ్రామాలలో కూలీలు వలస వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు స్పందించి ప్రతీ జాబ్ కార్డుదారునికి నిర్దేశించిన పని దినాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెసా క మిటీ కార్యదర్శి దేవరాజు, కూలీలు పండన్న, బీమన్న, బుద్దన్న, సింహాద్రి పాల్గొన్నారు.



రోగుల గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నేత సన్నిబాబు తదితరులు

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు

చింతపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎన్నికల ప్రవ ర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింద న్నారు. బ హిరంగ ప్రదేశాల్లో ఎక్కడా రాజకీయ నాయకులు చిత్రాలు, ఫ్లెక్సీలు ఉండరాదన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగువేయాల న్నారు. కొత్తపనులు ప్రారంభించరాదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నేతల ఫొటోలను తొలగించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సభలు, సమావేశాలకు అనుమతి ఉండాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

డిగ్రీ విద్యార్థుల ఎడ్యుకేషన్ టూర్



విశాఖ ఫిషింగ్ హార్బర్ వద్ద డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులు

పాడేరురూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంపై విద్యార్థులలో మరింత అవగాహనకు ఎడ్యుకేషన్ టూర్ దోహదపడుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల వైస్‌ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్ అన్నారు. డిగ్రీ తృతీయ సంవత్సరానికి చెందిన బీఎస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ సైన్స్, బోటనీ, జువాలజీ గ్రూపు విద్యార్థులను గురు వారం ఎడ్యుకేషన్ టూరుకు విశాఖపట్నం తీసుకువెళ్లారు. ఇలాంటి పర్యటన వల్ల శాస్త్ర సాంకేతిక రంగాలలో వారికి మరింత అవగాహన పెరుగుతుందన్నారు. విద్యార్థులు పరి శోధనపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు జూపార్కు, సీఎంఎస్ ల్యాబరేటరీ, ఏయూ లైబ్రరీతో షిప్పింగ్ హార్బర్‌ను సందర్శించారన్నారు.అక్కడి మ్యూజియంలో ఉన్న వివిధ రకాల చేపల రకాలను సైంటిస్టు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జి.దామోదర్, డాక్టర్.జానకీరామ్, సి.సౌజన్య, ప్రసన్న, జి.భాస్కర్, కె.అప్పలనాయుడు, గౌరీశంకరరావు పాల్గొన్నారు.

క్రైస్తవ సేవకులకు సైకిళ్లు పంపిణీ

హుకుంపేట జనవరి 30 ఆంధ్రజ్యోతి; క్రైస్తవ సేవకులు ప్రజల్లో మరింత భక్తి భావం పెంచేలా కృషి చేయాలని జాయ్‌ఫర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని తిగలవలస పంచాయతీ కేంద్రంలో క్రైస్తవ సేవకు లకు మాజీ సర్పంచ్ కామేశ్వరావు ఆధ్వర్యంలో 10 మంది పాస్టర్‌కు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉం డాలని కోరారు. ఈ కార్య క్రమంలో పాస్టర్లు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం

అనకాపల్లి క్లస్టర్ ఏపీడీ మణికుమార్



పి.పొన్నవోలులో ట్రెంచ్ కటింగ్ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

రావికమతం, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి క్లస్టర్ పరిధిలో ఆరు మండలాల్లో ఉపాధి హామీ పథకం పనులు శరవేగంగా జరిగేలా చర్యలు చేపడుతున్నట్టు క్లస్టర్ ఏపీడీ మణికుమార్ తెలిపారు. గురువారం ఆయన మండలంలో మేడివాడ, పి.పొన్నవోలు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. చెరువు పూడిక తీత పనులు, జీడిమామిడి తోటల్లో ట్రెంచ్ కటింగ్ పనులపై కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి కూలీలు రోజుకు గరిష్ఠ వేతనం రూ. 300లు వచ్చేలా పనులు నిర్వహించాలన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ,తన పరిధిలో రావికమతం, పరవాడ, సబ్బవరం, కశింకోట, మునగపాక,అనకాపల్లి ఆరు మండలాల్లో 40 వేల మంది ఉపాధి కూలీలు ఉండగా, వారిలో 25 నుంచి 50 వరకు సభ్యులను కలిపి వెయ్యి శ్రమ శక్తి సంఘాలుగా ఏర్పాటు చేశామన్నారు. రోజుకి 24,822 పని దినాలు కల్పించాలని లక్ష్యం కాగా, ప్రస్తుతం 13,388 పని దినాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. క్లస్టర్ పరిధిలో 152 గ్రామాలలో గ్రామానికి రెండు చొప్పున ఉపాధి పథకంలో పశువుల షెడ్‌లు 304 షెడ్లను జూన్ నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యమన్నారు.. ఈ కార్యక్రమంలో ఏపీవో కాశి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి విద్యార్థిని ఎంపిక



విద్యార్థినికి అనుమతిపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండో సంవత్సరం విద్యార్థిని సవరాల వెంకటలక్ష్మి ఎంపికైంది. ఫిబ్రవరి 4 నుంచి పంజాబ్‌లోని ఛండీఘడ్ యూనివర్శిటీలో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో విద్యార్థిని పాల్గొననున్నట్టు కాలేజీ ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, బి. పిచ్చమ్మ తెలిపారు.ఎంపికైన వెంకటలక్ష్మిని ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు. ఈ జాతీయ సమైక్యతా శిబిరంలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రదర్శనలు ఇస్తారన్నారు.

వైసీపీ ఆర్టీఐ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా రమణ



కేపీ రమణ

దేవరాపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి) వైసీపీ ఆర్టీఐ వింగ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా దేవరాపల్లికి చెందిన కేపీ రమణను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మకంతో తన అప్పగించిన పదవిని బాధ్యతతో నిర్వహిస్తాన్నారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అక్షరాస్యతతో మోసాలు నిరోధం



ఉల్లాస్ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సువర్ణరాజు

దేవరాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న మోసాలు నుంచి బయట పడాలంటే ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని ఎంపీడీఓ సువర్ణరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్ ఆధ్వర్యంలో వెలుగు గ్రామ సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘంలో ఉన్న ప్రతి సభ్యులు అక్షరాస్యులయితే, ఎటువంటి మోసాలు జరగవన్నారు. ఆన్‌లైన్ మోసాలనూ నిరోధించవచ్చునన్నారు. ప్రతి నెలా చెల్లిస్తున్న పొదుపు తీసుకున్న రుణం లెక్కలు తెలుసుకోవాలన్నా చదువు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ లక్ష్మీనారాయణ, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న హెచ్ఎం ప్రసాద్

రోలుగుంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో సమీపిస్తున్నందున విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు సైతం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక జడ్పీ పాఠశాల హెచ్ఎం ప్రసాద్ సూచించారు. గురువారంపాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదం డ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పిల్లలను ఒత్తిడి చేయకుండా ఇంటి వద్ద ప్రత్యేక వాతావరణం కల్పించాలన్నారు. ఉదయం వేళ నిద్రలేచి చదువుకునేలా చూడాలన్నారు. పోషకాహారంతో కూడిన ఆహారం అం దించాలని కోరారు. పాఠశాలలో తాము ప్రతీ రోజు ప్రత్యేక తరగతులను నిర్వహించి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీయల్ వితరణ

రావికమతం,జనవరి30, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సేవ మాధవ సేవతో సమానమని ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మీనాయుడు అన్నారు. దివ్యాంగుల ప్రత్యేక వైద్య నిపుణుడు పంచాడ నాయుడు సమకూర్చిన పదో తరగతి దివ్యాంగ విద్యార్థులకు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వివిధ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 25 మంది దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందించినట్టుచెప్పారు. ఈ కార్యక్రమంలో మేడివాడ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.రామచంద్రరావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు జగన్నాథనాయుడు, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, గంజి నాగేశ్వరావు,రమణాజీ, గోవిందరావులున్నారు.

నేడు అడవి రాజులబాబు పండుగ

గొలుగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీడిగుమ్మల, ఎర్రవరం, పోలవరం, కొత్త ఎల్లవరం, జి. కొత్తూరు గ్రామాల్లో శుక్రవారం అడవి రాజులబాబు పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకోనున్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

పప్పుశెట్టిపాలెం శివారు జమ్మాదేవిపేటలో గ్రామస్థుల అభిప్రాయాలను సేకరించిన ఎంపీడీవో ▸ ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని వెల్లడి



ఎప్పుశెట్టిపాలెం పంచాయతీ శివారు జమ్మాదేవిపేటలో విచారణ జరుపుతున్న అధికారుల బృందం

గొలుగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీ శివారు జమ్మాదేవిపేటలో కమ్యూనిటీ భవన నిర్మాణం పేరుతో సర్పంచ్ నిధులు స్వాహా చేశారని వార్డు సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం ఎంపీడీవో మేరీ రోజీ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు గ్రామంలో విచారణ నిర్వహించారు. గ్రామస్థుల సమక్షంలో ఈ విచారణ జరపడంతో పలువురు వారివారి అభిప్రాయాలను అధికారులకు తెలియజేశారు. తమ గ్రామంలో సామాజిక భవనాన్ని తమ సొంత నిధులతో ప్రారంభించామన్నారు. పిల్లర్ల స్థాయికి చేరగా, ఆ సమయంలో పంచాయతీ ఎన్నికలు రావడంతో పప్పుశెట్టిపాలెం పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంటే జమ్మాదేవిపేటలో కమ్యూనిటీ భవనాన్ని తమ సొంత నిధులతో పూర్తి చేస్తానని అప్పట్లో ప్రస్తుత సర్పంచ్ భర్త రామకృష్ణ హామీ ఇచ్చారని గ్రామస్థులు వివరించారు. ఆ మేరకు పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. అయితే కమ్యూనిటీ భవనాన్ని శ్లాబ్ వరకు నిర్మిచారని, ఇందుకోసం నాలుగు లక్షల ఎనభై వేల రూపాయల గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి డ్రా చేసినట్టు గ్రామస్థులు ఆరోపిస్తూ అభ్యంతరం తెలిపారు. అనంతరం సదరు సమాజిక భవనాన్ని ఎంపీడీవో పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విచారణ సందర్భంగా గ్రామస్థులు వెల్లడించిన అన్ని వివరాలను నమోదు చేసుకున్నామన్నారు. ఉన్నతాధికారులకు దీనిపై నివేదిక అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాకిరెడ్డి వరహాలు, టీడీపీ నాయకులు బెల్లపు కొండలరావు, సర్పంచ్ విజయలక్ష్మి, కార్యదర్శులు పాల్గొన్నారు.

గాంధీజీకి నివాళి



మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు

నర్సీపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పలుచోట్ల గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సీపట్నంలో గల వాసవీ కల్యాణ మండపం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం సభ్యులు పదిహేను మంది పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నాళం రమేశ్‌కుమార్, కేదార్ శెట్టి బంగారు శెట్టి, తాటికొండ హేమంత్, పల్లపోతు గణేశ్ సొంత నిధులతో వీటిని సమకూర్చారు. అలాగే, వనిత వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలగా నారాయణరావు, సీఎస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా పెదబొడ్డేపల్లి పెద్ద చెరువు వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వైసీపీ నాయకులు ఏకా శివప్రసాద్, పెట్ల నాయుడు, తమరాన శ్రీను, బేతిరెడ్డి విజయ్, శేషు పూలమాల వేసి నివాళులర్పించారు.

మాకవరపాలెం :మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ వర్ధంతిని జరిపారు. మాకవరపాలెం గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు కట్టా రామారావు, రఘుబాబు, ప్రకాష్, గ్రామ ఉ పసర్పంచ్ లాలం రాము ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే తామరంలో తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు గొంతిన హరిబాబు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ గాంధీజీ ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



నర్సీపట్నంలో నిత్యావసరాలు పంపిణీ

లింగంపేటలో చెత్త బుట్టలు పంపిణీ

కృష్ణాదేవిపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం లింగంపేటలో పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం ఆరువందల డస్టు బిన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తోకల సంతోష్‌కుమార్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను రోడ్లపై పారబోయకుండా ఈ డబ్బాల్లో వేసి ఇళ్లకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. కార్యదర్శి పవన్‌కుమార్, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, జనసేన మండల ఉపాధ్యక్షుడు లంక సత్యనారాయణ, ఎంపీటీసీ జి.మహాలక్ష్మి, కూటమి నాయకులు రమణ, దేముడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీ ఘటనలో ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి మునిసిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీలో పాత నేరస్థులు బీభత్సం సృష్టించిన కేసులో ముగ్గురిని అరెస్టు చేశామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులకు ఉన్నారని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు. వీరిని పట్టుకుకోవడానికి. పట్టణ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ, రూరల్, మాకవరపాలెం, కృష్ణాదేవిపేట ఎస్ఐలతో మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

రెండేళ్ల ఐటీఐ కోర్సులు పూర్తి చేస్తే పాలిటెక్నిక్‌లో ప్రవేశం

ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి

నర్సీపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశాలకు బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తున్నామని ఇక్కడి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్ల వ్యవధి గల ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు సంబంధిత పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో చేరవచ్చునన్నారు. ఐటీఐలో అరవై శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు పదో తరగతి సర్టిఫికేట్ జత చేసి నర్సీపట్నం ఐటీఐలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 21 వరకు శిక్షణ ఇస్తామని చెప్పారు. దీనిపై ఎటువంటి సందేహాలు ఉన్నా 80742 66414 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

డిపో మేనేజర్ దృష్టికి బడి బస్సుల సమస్య

నర్సీపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బడి బస్సులతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఇక్కడి ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. బస్సులు సకాలంలో రాకపోవడం వల్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్ తదితరులు తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థుల విలువైన సమయం వృథా కాకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్టు విలేకరులకు వారు తెలిపారు.

ఏఎల్‌పురం హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణం ప్రారంభం

కృష్ణాదేవిపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : ఏఎల్‌పురం హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ భవన నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుల్లిప్రసాద్, టీడీపీ నాయకులు చిట్టిబాబు, స్వామినాయుడు, బొడ్డు జమీలు, జేఈఈ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ లగుడు రాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ ఆశయాలు అనుసరణీయం



చోడవరంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సభ్యులు



దేవరాపల్లి మండలం బి. కింతాడలో ..

చోడవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ ఆశయాలు అనుసరణీయమని పలువురు అన్నారు. పట్టణంలోని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ప్రేమ సమాజం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవీ రీజినల్ ఛైర్మన్ పసుమర్తి అశోక్, అధ్యక్షుడే రాజు, కార్యదర్శి రాజేష్, కోశాధికారి అర్రెపు శ్రీనివాస్, ప్రేమసమాజం ఇన్‌చార్జి ప్రసాదరాజు, డీఎస్ ప్రసాద్, కేతవరపు రామకృష్ణ, బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు. వనితాక్లబ్ ఆధ్వర్యంలో పెదబజారువీధిలో ప్రతినిధులు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దేవరాపల్లి: మండలంలోని బి.కింతాడలో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ వి గ్రహానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక రామాలయం వద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించారు.. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీను, పి.గోపి, బత్తుల నానాజీ, సీపీఎం నాయకులు డి.వెంకన్న, బి.టి. దొర, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని నిరసన



గాంధీ చిత్రపటం ఎదుట నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

రోలుగుంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత గాంధీ వర్ధంతి సందర్భంగా మండలంలోని ఎంకేపట్నం పంచాయతీ శివారు పెదపేటలో ఆదివాసీలు గురువారం వినూత్న నిరసన చేపట్టారు. తమ గ్రామానికి ఉపాధి పథకం పనులు కల్పించాలంటూ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, చేతులు జోడిస్తూ నిరసన చేపట్టారు. ఓ మహాత్మా నీ పేరిట ప్రారంభించిన పథకంలో తమకు పనుల్లేవు, ఇకనైనా పనులు కల్పించాలని వేడుకున్నారు. గ్రామంలో ఉన్న 25 కుటుంబాలకు జిరాయితీ భూములు, 12 కుటుంబాలకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్నాయని కానీ నేటికీ మా భూముల అభివృద్ధికి ఉపా ది పనులు కల్పించడం లేదన్నారు. చాలా మందికి జాబ్‌కార్డులు రద్దయ్యాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఉపాధి పనులు కల్పించాలని, లేకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ స భ్యు లు కె. గోవిందరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రతి పౌరుడికీ రక్షణ కవచం



సమావేశంలో మాట్లాడుతున్న కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రతి పౌరుడికి రక్షణ కవచంలా పనిచేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు కాటపల్లి అప్పారావు అన్నారు. మండలంలోని రైవాడ గ్రామం ఎస్సీ కాలనీలో గురువారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రతిప్రాదిపదికపై అంబేడ్కర్ రాజ్యాంగం రూపకల్పన చేశారన్నారు. దీనిపై అవగాహన కలిగించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ లక్ష్మి, సోషల్ వెల్ఫేర్ అధికారులు , రమేశ్, గంగునాయుడు, ఆర్ఐ సతీశ్, కె.ఎస్. అప్పలనాయుడు పాల్గొన్నారు.

చీడికాడలో ఆంజనేయస్వామి తీర్థం రేపు



చీడికాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అభయాంజనే యస్వామి తీర్థం ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహిం చనున్నామని ఆలయ కమిటీ ఛైర్మన్ రవిరాజు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు ఆ రోజు ముగ్గుల పోటీలు, కోలాటాలు, రాత్రికి పౌరాణిక నాటకాలను ప్రదర్శించనున్నామన్నారు.

'ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి'



తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న ఆదివాసీలు

మాడుగుల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని ఏపీ ఆదివాసీల సంఘం గౌరవ సలహాదారుడు అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గాంధీ పార్కు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మండలంలోని పలు గ్రామాల గిరిజనులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ... అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ లపై ప్రత్యేక దృష్టి సారించి వారి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. మండలంలోని జాలంపల్లి పంచాయతీలో 175 కుటుంబాలు గత 30 ఏళ్లగా సీలింగ్ మిగిలిన భూములు సాగు చేస్తున్నా వారికి పట్టాలు లేవని ఆయన గుర్తు చేశారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందలేకపోతున్నారన్నారు. అలాగే, శంకరం పంచాయతీలో ఆదివాసీలకు ఇచ్చిన డీ ఫారం పట్టాలను రికార్డుల్లో పట్టాదారు పాసుపుస్తకాలుగా మార్చి కొందరు భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డీ ఫారం పట్టాదారులు జాబితా ఆధారంగా సామాజిక తనిఖీ చేసి అసలైన సాగు రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జాలంపల్లి, శంకరం పంచాయతీ వాసులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ



ముగ్గులు పోటీల్లో మహిళలు

మాడుగుల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడపాడులో గురువారం సీతారాముల వారి తీర్థం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయం పక్కన ముగ్గులు పోటీలు నిర్వహించారు. స్థానిక పాఠశాల హెచ్ఎం అనసూయ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, నాగేశ్, గట్రెడ్డి శివాజీ, గొర్లి రమేశ్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

జాబ్ మేళా వాయిదా

దేవరాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లిలో ఈనెల 31న జరగాల్సిన జాబ్ మేళా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల వాయిదా పడినట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి క్యాంపు కార్యాలయం బుధవారం ఓ ప్రకటన లో తెలిపింది. సుమారు 15 కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఈ జాబ్‌మేళాపై గ్రామాల్లో ఇప్పటికే ప్రచారం చేశారు. ఎన్నిక లైన తరువాత జాబ్‌మేళా తేదీ ప్రకటిస్తామని పేర్కొంది.

ఏటికొప్పాక లక్కబొమ్మలు దేశానికే గర్వకారణం

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్
- హస్త కళాకారుడు సంతోశ్‌కు సత్కారం



ఏటికొప్పాక కళాకారుడు సంతోశ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఏటికొప్పాక లక్కబొమ్మలు దేశానికే గర్వకారణంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కొనియాడారు. గురువారం ఎలమంచిలి జనసేన పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ఏటికొప్పాక హస్త కళాకారుడు గొర్సా సంతోశ్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మల శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ తృతీయ అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ బొమ్మల శకటాన్ని ఐ అండ్ పీఆర్ అధికారుల సూచనలు, సలహాలతో రూపొందించిన సంతోశ్‌ను గురువారం సత్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. 30 సంవత్సరాల తరువాత మన రాష్ట్రానికి అవార్డు దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు అందిస్తున్న ప్రోత్సాహంతో దేశంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ఏటికొప్పాక హస్త కళారంగాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, కూటమి నేతలు కర్రి జాన్సీ, శ్రీను, కొలగాని భాస్కరరావు, అందే రమణ, నక్కా శివశంకర్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో 13.5 డిగ్రీలు

పాడేరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. అలాగే పొగమంచు ప్రభావం సైతం తగ్గుముఖం పట్టడంతో చలి తీవ్రత తగ్గింది. గురువారం ముంచంగిపుట్టులో 13.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, పెదబయలులో 14.2, జి.మాడుగులలో 14.5, డుంబ్రిగుడలో 14.7, హుకుంపేటలో 14.9, జీకేవీధిలో 15.0, అరకులోయలో 15.2, పాడేరులో 15.7, అనంతగిరిలో 15.8, చింతపల్లిలో 16.0, కొయ్యూరులో 17.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శుభ ముహూర్తాలకు వేళాయె

- మాఘమాసం ప్రారంభం
- జూన్ నెల వరకు శుభకార్యాల సందడి



నక్కపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం.. అంటేనే అన్ని శుభ కార్యాలకు శ్రేష్ఠమని శాస్త్రం చెబుతోంది. గురువారం నుంచి మాఘమాసం ప్రారంభమైంది. గత మూడు నెలల నుంచి వివాహాది శుభ ముహూర్తాలు లేకపోవడం, పుష్యమాసం పోవడంతో ఇప్పుడు పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వాడవాడలా మంగళవాద్యాలు, పెళ్లి మండపాలతో కళకళలాడనున్నాయి. వివాహాలు నిశ్చయమైన వారు, కొత్త గృహాలు నిర్మించుకున్న వారు, నూతన గృహాలకు శంకుస్థాపన చేయాలనుకునే వారు, అనేక చోట్ల కొత్తగా నిర్మించిన ఆలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. ఎన్నో శుభకార్యాలకు మాఘమాసం వేదికకానుంది. మాఘమాసం, ఫాల్గుణం, చైత్రం, వైశాఖ, జ్యేష్ఠమాసాలు వరుసగా ఈ ఐదు నెలలపాటు అనేక శుభ ముహూర్తాలున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే రికార్డు స్థాయిలో వివాహాలు జరగనున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కూడా ఎక్కువ ముహూర్తాలున్నాయి. ఈ కారణంగా తెలుగు రాష్ట్రాల్లో కల్యాణ గంటలు మోతెక్కనున్నాయి. జనవరి 31 శుక్రవారం నుంచి శుభ ముహూర్తాలున్నాయి. ఐదు నెలల్లో 60కి పైగా పెళ్లి ముహూర్తాలుండడం విశేషం.

ఇవీ మంచి ముహూర్తాలు

- ఫిబ్రవరిలో 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 14, 15 తేదీలు
- మార్చిలో 4, 6, 7, 8, 11, 12, 13, 14, 15, 21, 22, 25, 26
- ఏప్రిల్‌లో 2, 3, 4, 5, 7, 8, 10, 11, 12, 14, 15, 21, 22, 23, 29
- మేలో 1, 2, 3, 5, 6, 7, 8, 9, 10, 11, 12, 14, 20, 27, 28, 29, 30
- జూన్‌లో 3 ,4, 5, 6, 7, 10, 11, 12

అద్భుతమైన ముహూర్తాలు



ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అన్ని శుభకార్యాలకు అద్భుతమైన ముహూర్తాలున్నాయి. చాలా కాలం తరువాత ఒక సంవత్సరంలో అన్ని ముహూర్తాలు రావడం విశేషం. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు, అక్టోబరు నుంచి డిసెంబరు వరకు 100కి పైగా ముహూర్తాలున్నాయి.

- శ్రీపాద సత్యదేవశర్మ, చినదొడ్డిగల్లు, పండితుడు

మహాత్మా మన్నించు!

- జాతిపిత వర్ధంతిని విస్మరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- మాడుగులలో గాంధీజీ విగ్రహం వద్ద అపరిశుభ్ర వాతావరణం



గాంధీజీ విగ్రహం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

మాడుగుల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీని అధికారులు, ప్రజాప్రతినిధులు విస్మరించారు. గురువారం ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని ఏ ఒక్కరూ నిర్వహించలేదు. ఆ మహనీయుని విగ్రహాన్ని, పరిసరాలను శుభ్రం కూడా చేయలేదు. మాడుగులలో సుమారు 70 ఏళ్ల క్రితం గాంధీ పార్కును ఏర్పాటు చేసి మహాత్ముడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఏటా గాంధీ జయంతి, వర్ధంతి రోజుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ఆర్య వైశ్య సంఘం పెద్దలు.. జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తుంటారు. కానీ గురువారం గాంధీజీ వర్ధంతి అన్న విషయాన్ని ఆయా ప్రముఖులు మరిచిపోయారు. విగ్రహంపై దుమ్ము, ధూళి పేరుకుపోయి వుంది. నీడ కోసం నిర్మించిన కప్పు మీద, విగ్రహం చుట్టూ ఎండిపోయిన ఆకులతో అపరిశుభ్రంగా వుంది. పంచాయతీ పాలకులు, అధికారుల తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఆర్య వైశ్య సంఘం పటిష్ఠంగా వుంది. కనీసం సంఘం ప్రతినిధులు అయినా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వుంటే బాగుండేని అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రాభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్న వైసీపీ నేతలు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు విమర్శ



ఈనో ప్యాకెట్లను చూపుతున్న టీడీపీ నాయకులు

తుమ్మపాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిని చూసి వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వైసీపీ నాయకులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మశ్రీలకు ఈనో ప్యాకెట్లను పంపిస్తున్నట్టు ప్రకటించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు గుడివాడ అమర్‌నాథ్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వైసీపీ పాలన కారణంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడ్డారని, ఏడు నెలల కూటమి పాలనలో అనకాపల్లి జిల్లాకు లక్షా 80 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను విమర్శించే హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు. కేంద్రం నుంచి సమగ్ర నిధులు తేవడంలో ఎంపీ సీఎం రమేశ్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట్ని బాలాజీ, గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళి, పోలారపు త్రినాథ్, సేనాపతి స్వరూప, కర్రి బాబీ, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో స్థిర ఆదాయం

- రైతులకు పలు రకాల ప్రోత్సాహకాలు, రాయితీలు
- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు



కాలీఫ్లవర్ పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు

కె.కోటపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కూరగాయ పంటల సాగుతో స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు చెప్పారు. గురువారం ఆయన కె.సంతపాలెంలో సాగు చేస్తున్న పలు రకాల కూరగాయ పంటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కూరగాయ పంటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం పలు రకాల ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తున్నదని చెప్పారు. కె.కోటపాడు మండలంలో కె.సంతపాలెం, ఆర్లి, సూదివలస, కింతాడ, చోడవరం మండలంలో అడ్డూరు, సబ్బవరం, మండలంలో వంగలి, అమృతపురం గ్రామాలను 'వెజిటబుల్ క్లస్టర్'గా గుర్తించామన్నారు. ఈ గ్రామాల నుంచి నిత్యం విశాఖ నగరానికి పెద్ద మొత్తంలో కూరగాయలు సరఫరా అవుతున్నాయని చెప్పారు. రైతులకు తెగుళ్లను తట్టుకునే మేలైన కూరగాయ విత్తనాలను అందజేస్తున్నామని తెలిపారు. కూరగాయలు పండించే రైతులు మల్చింగ్, డ్రిప్ పద్ధతులను పాటిస్తే నీరు ఆదాతోపాటు పొలంలో కలుపు బెడద వుండదని, అధిక దిగుబడులు సాధించే అవకాశం వుందన్నారు. తీగ జాతి కూరగాయ పంటలను సాగు చేసే వారికి ప్రభుత్వం సబ్సిడీపై పందిరి సామగ్రి అందజేస్తున్నదని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్‌లో కూరగాయాలకు గిట్టుబాటు ధర లభించనప్పుడు రైతులు విలువ ఆధారిత ఉత్పత్తులు (పచ్చళ్లు, పొడులు, వరుగులు వగైరా) తయారు చేసుకోవచ్చని, ఇందుకోసం మహిళలకు శిక్షణ ఇస్తున్నామని, ఆయా ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. సేంద్రియ విధానంలో కూరగాయలు పండించడానికి రైతులు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు సూచించారు.

మరో రెండు నగర వనాలు

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలో ఆయుర్వేద ఔషధ మొక్కల క్షేత్రాన్ని నగర వనాలుగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపినట్టు జిల్లా అటవీ అధికారి శామ్యూల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పట్టణ వాసులకు అటవీ ప్రాంతంలో ఉన్నట్టు అనుభూతి కల్పించేలా నగర వనాలను తీర్చిదిద్దనున్నారు. కార్తీక మాసంలో పిక్నిక్‌లు నిర్వహించుకోవడానికి అనువుగా వుంటాయి. భవిష్యత్తులో ఇవి పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి చెంది, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని భావిస్తున్నారు.

అభివృద్ధికి నోచుకోని బొజ్జన్నకొండ

... 5వ పేజీ తరువాయి

జాతీయ రహదారి నుంచి బొజ్జన్న కొండకు రోడ్డు అభివృద్ధి, ఆర్చి నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.90 లక్షలు మంజూరు చేశారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు హడావిడిగా పనులు చేశారు.

డీపీఆర్ తయారీకి ప్రభుత్వం ఆదేశాలు

ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కూటమి ప్రభుత్వాలు ఏర్పడడంతో బొజ్జన్నకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తారని జిల్లా వాసులు ఆశిస్తున్నారు. బొజ్జన్నకొండ అభివృద్ధికి కొత్తగా డీపీఆర్‌ను రూపొందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో పర్యాటక అధికారులు ఆ మేరకు చర్యలు చేపట్టారు.

విశాఖ డెయిరీపై రైతుల కన్నెర్ర

... 5వ పేజీ తరువాయి

విశాఖ డెయిరీ యాజమాన్యం కొంతకాలంగా తీసుకుంటున్న నిర్ణయాలు తమకు ఇబ్బందిగా మారాయని పాల ఉత్పత్తిదారులు (రైతులు) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డెయిరీకి పాలు పోసే రైతులకు గతంలో పలు రకాల ప్రోత్సాహకాలు, రాయితీలు ఇచ్చేవారు. వీటిలో కొన్నింటికి మంగళం పలికింది. బోనస్‌లు తగ్గించివేయడంతోపాటు రైతు చనిపోతే బాధిత కుటుంబానికి ఇచ్చే సాయాన్ని కూడా కుదించారు. పశువుల పెంపకం భారంగా మారినప్పటికీ, కుటుంబానికి ఆర్థిక ఆసరాగా ఉంటుందన్న ఉద్దేశంతో రైతులు విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆవు పాలకు డిమాండ్ లేదంటూ రెండు నెలల నుంచి సేకరణ ధరను లీటరుకు రూ.4 తగ్గించింది. ఇప్పుడు పాలసేకరణను తగ్గించింది. కేంద్రాలకు పాలు తీసుకువచ్చిన రైతులకు లీటరుకు వంద మిల్లీలీటర్ల చొప్పున సిబ్బంది తిరిగి ఇచ్చేస్తున్నారు. త్వరలో గేదె పాలకు కూడా ఇదే నిబంధనను అమలు చేస్తారని చెబుతున్నారు. అంతేకాక వారానికి ఒక రోజు పాలసేకరణను నిలిపివేయాలని భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఇంతకాలం తమ రెక్కల కష్టంతో వ్యాపారం చేసుకుంటూ లాభాలు గడించిన విశాఖ డెయిరీ యాజమాన్యం.. ఇప్పుడు పాల వ్యాపారంలో ఇబ్బందులు వస్తున్నాయని సాకులు చూపిస్తూ తమకు అన్యాయం చేయడం ఏమిటని పాల ఉత్పత్తిదారులు మండిపడుతున్నారు.

నోరు మెదపని పాల సంఘాల పాలకవర్గాలు

విశాఖ డెయిరీ యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలు రైతులకు ఇబ్బందికరంగా మారినప్పటికీ ఆయా పాల సంఘాల పాలకవర్గాలు మాత్రం నోరు మెదపడంలేదు. యాజమాన్యం తీసుకుంటున్న రైతు వ్యతిరేక నిర్ణయాలకు అడ్డుచెప్పకుండా.. గుడ్డిగా అమలు చేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. డెయిరీ యాజమాన్యం తమకు అనుకూలంగా వుండే వారినే పాలసంఘాల ఎన్నికల్లో డైరెక్టర్లుగా, అధ్యక్షులుగా నిలబెట్టి గెలిపించుకోవడంతో ఇప్పుడు డెయిరీ యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకించవారే లేకపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి, పాల ఉత్పత్తిదారులకు తీవ్ర నష్టం కలిగించేలా విశాఖ డెయిరీ యాజమాన్యం ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

క్రైం... crime news

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్టు

కశింకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపర్తి గ్రామంలో అదనపు కట్నం కోసం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. కశింకోటలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. 2019లో వివాహం జరిగే సమయంలో పలివేల కృపాసాగర్‌కు మిరియాల సుమ పుట్టింటి వారు రూ.లక్ష కట్నం కింద, మరొక రూ.లక్ష ఇతర లాంఛనాలకు, రూ.30 వేలు ఆడపడుచు కట్నం ఇచ్చారన్నారు. అదనపు కట్నం తేవాలని కొంతకాలం నుంచి సుమను వేధించడంతో ఆమె తల్లి వెంకయమ్మ అప్పు చేసి రూ.10 వేలు ఇచ్చిందని తెలిపారు. అయినా అత్తింటి వారి వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుమ ఆత్మహత్య చేసుకున్నట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. భర్త కృపాసాగర్, అత్త పలివేల పార్వతి, మామ అప్పారావు, ఆడపడుచు మేరీలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు.

మహబూబాబాద్‌లో నర్సీపట్నం యువకుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న ఒక లాడ్జిలో నర్సీపట్నానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సీపట్నంలోని చాకలి కాలనీకి చెందిన పనస పతంజలి పవన్ ప్రేమ్‌కుమార్ (31) బుధవారం మధ్యాహ్నం శివప్రియ లాడ్జికి వచ్చి ఒక రూమ్ బుక్ తీసుకున్నాడు. స్టాఫ్ సెలక్షన్ కమిటీ పరీక్ష ఉందని, అందుకే ఇక్కడికి వచ్చానని లాడ్జి యజమానికి చెప్పాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం రూమ్ తలుపులు తీయకపోవడంతో సిబ్బంది బలవంతగా తీసి చూశారు. ప్రేమ్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. ఇతనికి మూడు నెలల క్రితం వివాహం అయినట్టు తెలిసింది. తల్లిదండ్రులుకు సమాచారం అందించామని, వారు వచ్చిన తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్ఐ చెప్పారు.

ఆరు జిల్లాల్లో ఎన్నికల కోడ్

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం ఎన్నికలకు వచ్చే నెల 3 నుంచి నామినేషన్లు స్వీకరణ
- 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు
- ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలి
- ఎన్నికల అధికారి, విశాఖపట్నం కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ వచ్చే నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఆరు జిల్లాల పరిధిలో కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. వచ్చే నెల మూడో తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆ రోజు నుంచి విశాఖ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్టు తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలతో నామినేషన్లకు గడువు దాఖలుకు ముగుస్తుందని, 11న పరిశీలన, 13వ తేదీ వరకూ ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. 27న బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరుగుతుందని, మార్చి మూడో తేదీన ఓటర్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే అన్ని రకాల నిబంధనలు వర్తిస్తాయని, అయితే ఎన్నికల ఖర్చు విషయంలో పరిమితి లేదని కలెక్టర్ వెల్లడించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల రెవెన్యూ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని వివరించారు. గత నెల 30వ తేదీ నాటికి 21,555 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారని, వీరిలో పురుషులు 12,948, మహిళలు 8,607 మంది ఉన్నారని వివరించారు. అర్హత కలిగిన వారంతా నామినేషన్ల దాఖలుకు పది రోజుల ముందు అంటే శుక్రవారం సాయంత్రం మూడు గంటల వరకూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని స్పష్టంచేశారు.

బ్రాండిక్స్ ఉద్యోగులు ఆందోళన

... 5వ పేజీ తరువాయి

అమల్లో వుంది. మధ్యలో 30 నిమిషాలు భోజన విరామం వుంది. అయితే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అరగంట అదనంగా విధులు నిర్వహించాలని, ఇందుకుగాను శాశ్వత ఉద్యోగులకు నెలకు రూ.1,000, ఇతరులకు రూ.700 అదనంగా చెల్లిస్తామని యాజమాన్యం తెలిపింది. ఇందుకు ఉద్యోగులు అంగీకరించలేదు. ఎప్పటి మాదిరిగానే ఎనిమిది గంటలే పనిచేస్తామని స్పష్టం చేశారు. యాజమాన్య తీరును నిరసిస్తూ గురువారం మధ్యాహ్నం రెండో షిఫ్ట్‌కి వచ్చిన ఉద్యోగులతోపాటు, మొదటి షిఫ్ట్‌లో విధులు నిర్వహించి బయటకు వచ్చిన ఉద్యోగులు కలిసి ఆందోళనకు దిగారు. ఆదివారం కూడా విధులకు రావాలంటూ యాజమాన్యం హుకుం జారీ చేస్తున్నదని ఆరోపించారు. అరకొర జీతాలు ఇస్తూ టార్గెట్లు పెట్టి వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఉద్యోగులు మండి పడ్డారు. కాగా ఉద్యోగులతో ఆందోళనను విరమింపజేయడానికి యాజమాన్య ప్రతినిధులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

పరవాడ ఎంపీడీవోపై వేటు

... 5వ పేజీ తరువాయి

హాజరవుతుంటారని, తమను వేధి స్తుంటారని మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది వాపోతున్నారు. మహి ళలు అని కూడా చూడకుండా దుర్భాషలాడుతుంటారని ఆరోపిస్తున్నారు. ఇతని వేధింపులు భరించలేక ఇటీవల ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవోను తన నివాసానికి పిలిపించి ఆమె మందలించినట్టు తెలిసింది. అయినప్పటికీ ఎంపీడీవో తీరు మార్చుకోలేదు. పైగా సిబ్బంది పట్ల కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం మూడు గంటల సమయంలో మద్యం మత్తులో ఇక్కడ కార్యాలయానికి చేరుకున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాను అడిగిన ప్రశ్నలకు పరవాడ ఎంపీడీవో పొంతన లేని సమాధానం చెప్పడంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసి, ఇతనిపై విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా ఎంపీడీవో శ్యామ్‌సుందర్ గురువారం కొంతమంది ఉద్యోగులకు (సస్పెండ్ కాకముందు) ఫోన్ చేసి దుర్భాషలాడినట్టు తెలిసింది.

చెరువు మీదుగా హైవే పనులు

... 5వ పేజీ తరువాయి

ఒకసారి జరిగిన సమావేశంలో అధికారులు చెప్పారని గుర్తు చేశారు. దీనిపై నాటి ఇరిగేషన్ ఏఈ ద్వారా ఎస్ఈకి సమాచారం ఇచ్చామన్నారు. అయితే చెరువు స్థలం ఇవ్వడం నిబంధనలు అంగీకరించవంటూ ఎస్ఈ స్పష్టం చేశారని, తరువాత ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఎవరూ ఇటీవల వరకు ఆ ప్రస్తావన తేలేదన్నారు. అయితే వారం రోజుల నుంచి పెదనాయుడు చెరువును పూడ్చి, పక్కనే ట్రెంచ్ తవ్వుతున్నారన్నారు. తమకు మాటమాత్రం అయిన చెప్పకుండా చెరువులో రోడ్డు నిర్మాణం ఎలా చేపడతారని ప్రశ్నించారు. తక్షణమే పనులు ఆపాలని డిమాండ్ చేశారు. దీంతో సైట్ ఇంజనీర్ రామకృష్ణ, విజయనగరంలో వున్న ఎన్‌హెచ్ఏఐ పీడీకి ఫోన్ చేసి మాట్లాడారు. తాను సబ్బవరం వచ్చి రైతులతో మాట్లాడతానని ఆయన చెప్పారు. దీంతో రైతులు అక్కడి నుంచి వెనుతిరిగారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509